WWW.KALAMNIGHA.COM

# కలం నిఘా

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ ఆదివారం 25 మే 2025

సంపుటి: 15, సంచిక: 48, పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


## కేరళను తాకిన రుతుపవనాలు

16 ఏళ్ల తరవాత ముందే వచ్చేసిన నైరుతి

రెండు రోజుల్లో ఏపీలోకి ప్రవేశించే అవకాశం



2

## కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం



**కడప, మే 24(నిఘా న్యూస్):** కడప జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గువ్వలచెరువు ఘాట్ లో ప్రమాదకరమైన మలుపు వద్ద కారుపైకి దూసుకొచ్చిన అధికలోడు లారీ ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

## మాటల మనిషి కాదు...

# రేవంత్ మూటల మనిషి

### నిందలు, దందాలు, చందాలు ఇదే రేవంత్ పని విధానం: కేటీఆర్



- పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదు
- అన్ని పార్టీల్లో ఉన్నట్లే మా పార్టీలో రేవంత్ కోవర్టులు ఉండొచ్చు
- పార్టీలో ఏ హోదాలో ఉన్నా అంతర్గత విషయాలు బయట మాట్లాడవద్దు
- తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్, దెయ్యం రేవంత్ రెడ్డి అని విసుర్లు
- కవిత లేఖపై స్పందించిన కేటీఆర్

**హైదరాబాద్ మే 24 (నిఘా న్యూస్):** పార్టీ అధినేతకు సూచనలు చేయాలనుకుంటే లేఖలు రాయవచ్చునని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. పార్టీ అధినేతకు లేఖలు రాస్తే తప్పేమి కాదని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత లేఖపై కేటీఆర్ స్పందించారు. అంతర్గతంగా మాట్లాడే అంశాలు బయట మాట్లాడటం సరికాదని, పార్టీలో అందరం కార్యకర్తలమే. ఇది అందరికీ వర్తిస్తుందని చెప్పారు. తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని, కోవర్టులు సమయం వచ్చినప్పుడు వారే బయటపడతారని పేర్కొన్నారు. అన్ని పార్టీల్లోనూ కోవర్టులు ఉంటారని, తమ పార్టీలోనూ సీఎం రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ..మిగతా 2లో



## టీమ్ ఇండియాలాగ కేంద్రం రాష్ట్రాలు పనిచేయాలి

### మన అభివృద్ధి వేగాన్ని మరింత పెంచాలి

### నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని మోడీ

### సీఎంలతో పిచ్చాపాటిగా చాయ్ కబుర్లు

**న్యూఢిల్లీ మే 24 (నిఘా న్యూస్):** కేంద్రం, రాష్ట్రాలు టీమ్ ఇండియాలాగా కలిసి పనిచేస్తే ఏ లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని ప్రధాని మోడీ అన్నారు. ఢిల్లీలో మోడీ అధ్యక్షతన శనివారం నీతి అయోగ్ 10వ పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 'మనం అభివృద్ధి వేగాన్ని పెంచాలి. కేంద్రం, అన్ని రాష్ట్రాలు కలిసి వచ్చి టీం ఇండియాలాగా కలిసి పనిచేస్తే ఏ లక్ష్యం అసాధ్యం కాదు అని చెప్పినట్లు– నీతి అయోగ్ ఎక్స్ పోస్టు ద్వారా వెల్లడిరచింది. వికసిత్ భారత్ 2047 థీమ్‌తో ఈ కౌన్సిల్ సమావేశం జరిగినట్లు మోడీ వెల్లడిరచారు. ప్రతి భారతీయుడి లక్ష్యం వికసిత్ భారత్, ప్రతి రాష్ట్రం వికసిత్ అయినప్పుడు, భారత్ కూడా వికసిత్ అవుతుంది. ఇది 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్ష అని మోడీ అన్నారు. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ నితిఅయోగ్ సమావేశానికి ..మిగతా 2లో

## వైసీపీ ఛీత్కారాలను మరిచిన చిత్ర సీమ

### సినీ పరిశ్రమ తీరుపై డిప్యూటి సీఎం పవన్ ప్రశ్నలు



**అమరావతి మే 24(నిఘా న్యూస్):** తెలుగు చిత్ర పరిశ్రమపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాలయం సంచలన ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా తెలుగు సినిమా సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారా అని పవన్ పేషీ ప్రశ్నించింది. గత ప్రభుత్వం సినిమా రంగంవారిని, అగ్ర నటులను ఛీత్కరించిన తీరును గుర్తు చేసింది. ఇకపై ప్రభుత్వంతో ..మిగతా 2లో

## దేశంలో మళ్లీ విజృంభిస్తున్న కరోనా

### పలు రాష్ట్రాలలో నమోదవుతున్న కేసులు



**న్యూఢిల్లీ మే 24(నిఘా న్యూస్):** కరోనా వైరస్ పూర్తిగా తుడిచి పెట్టుకు పోయిందన్న తరుణంలో మరోసారి పంజా విసురుతోంది. తాజాగా దేశంలోని పలు రాష్ట్రాలు ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వైరస్ కేసులు వెలుగు చూస్తున్నాయి. దిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో కొత్త కేసులను గుర్తిస్తున్నారు. మూడేళ్లలో తొలిసారి దిల్లీలో 23 మందికి వైరస్ సోకిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దాంతో అన్ని ప్రభుత్వాలు ఆసుపత్రులను అప్రమత్తం చేశాయి. కేసులు ..మిగతా 2లో

## ప్రతి కుటుంబానికి...

## ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్

2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు

వికసిత్ భారత్ సాకారంతో స్వర్ణాంధ్ర సాధించే లక్ష్యం

డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్,ఎఐ టెక్నాలజీ వినియోగం

నీతి ఆయోగ్ సమావేశంలో చంద్రబాబు ప్రసంగం




**న్యూఢిల్లీ మే 24 (నిఘా న్యూస్):** ఎపిని అభివృద్ధి పథంలో ముందు నిలిపేలా 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు ఎపి సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడిరచారు. వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులను తాము ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనే విషయాన్ని తన ప్రజంటేషన్‌లో వివరించారు. నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు వికసిత్ భారత్–2047, స్వర్ణాంధ్రపై నివేదిక ఇచ్చారు. పహల్గాం ..మిగతా 2లో



## వికసిత భారత్ లక్ష్య సాధనలో

# కీలక భూమిక

- అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక
- ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంత లక్ష్యాలు
- నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం

**న్యూఢిల్లీ మే 24(నిఘా న్యూస్):** వికసిత భారత్ లక్ష్య సాధన మనందరి ఆశయం. అందులో తెలంగాణ కీలక పాత్ర పోషించాలని మా ఆకాంక్ష అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని, ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని సీఎం ప్రకటించారు. తెలంగాణ రైజింగ్ విజన్ లోని నాలుగు కీలక అంశాలను ముఖ్యమంత్రి ఈ ..మిగతా 2లో

## తెలంగాణకు ద్రోహం చేసిన బీజేపీ

బనకచర్లకు అనుమతులపై కేంద్రాన్ని, ఏపీని నిలదీయాలి

గోదావరి జలాలను ఎత్తుకుపోతుంటే ఏం చేస్తుండ్రు

మాజీమంత్రి హరీష్ రావు మండిపాటు



2

## వినోదం కోసం మమ్మల్ని వీధుల్లో తిప్పారు

అందాల పోటీల నిర్వాహకులపై మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగి అసంతృప్తి

నిర్వాహకులు వేశ్యలాగా చూశారంటూ ఇంటర్వ్యూ




**హైదరాబాద్ మే 24 (నిఘా న్యూస్):** అందాల పోటీల నిర్వాహకులపై అసంతృప్తితో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగి ఈ పోటీల నుంచి తప్పుకున్నట్లు తెలిసింది. ఆమె హైదరాబాద్‌ను వీడి ఇంగ్లండ్‌కు వెళ్లిపోయినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతోనే పోటీల నుంచి తప్పుకున్నట్లు నిర్వాహకులకు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే, పోటీల నుంచి తప్పుకున్న ..మిగతా 2లో

## అందాల పోటీల్లో పాల్గొనే వారిని వేశ్యల్లా చూస్తున్నారు

మిస్ ఇంగ్లాండ్, మిల్లా సన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ

ఇప్పుడే మంటారని ప్రశ్నించిన నారాయణ



2

# మాటల మనిషి కాదు...
# రేవంత్ మూటల మనిషి

**మొదటి పేజీ తరువాయి...**

ఉండొచ్చునని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు పెట్టాం. అసెంబ్లీలో ఓడిపోయాం.ఎలా ముందుకు పోవాలని 17 రోజుల పాటు వేల మంది కార్యకర్తలతో చర్చించాం. ఆ ప్రాసెస్‌లో చాలా మంది డ్కెరెక్ట్‌గా మైక్‌లో మాట్లాడిన వారు ఉన్నారు. కొంత మంది చిట్టీల మీద రాసిచ్చిన వారు ఉన్నారు. కొంత మంది కేసీఆర్‌కు ఉత్తరం అందించండి అని ఉత్తరాలు ఇచ్చిన వారు ఉన్నారు. మా పార్టీలో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉంది. మా పార్టీ అధ్యక్షుడికి ఏవైనా సూచనలు చేయాలను కుంటే ఉత్తరాలు రాయొచ్చు. మా పార్టీలో డెమొక్రసీ ఉంది కాబట్టి, సూచనలు సలహాలు చేస్తూ అధ్యక్షుడికి లిఖిత పూర్వకంగా, ఓరల్‌గా ఇవ్వొచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీలో ఏ హోదాలో ఉన్నా అంతర్గతంగా మాట్లాడాల్సిన విషయాలు అంతర్గతంగా మాట్లాడితేనే బాగుంటది. అధ్యక్షుడిని కలిసే అవకాశం ఉంది. ఆఫీస్ బేరర్స్ ఉన్నారు.వారిని కూడా కలిసే



అవకాశం ఉంది. కాబట్టి కొన్ని విషయాలు అంతర్గతంగానే మాట్లాడితే బాగుంటుంది. ఇది అందరికీ వర్తిస్తుంది. అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారు. అందులో రేవంత్ రెడ్డి కోవర్టులు ఉంటే ఉండొచ్చు అని కేటీఆర్ అన్నారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ అని,దెయ్యం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. హైకమాండ్ కు డబ్బులిస్తూ రేవంత్ పదవి కాపాడుకుంటున్నారని, ఇడి ఛార్జ్‌షీట్‌లో పేరున్న రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నాడు ఓటుకు నోటు స్కామ్.ఇది సీటుకు రూటు-స్కామ్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. నైతికత ఉంటే ముఖ్యమంత్రి స్వచ్ఛందంగా తప్పుకోవాలని, ఆయన తప్పుకోకుంటే అధిష్టానం తొలగించాలని సూచించారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి కాదని, మూటల మనిషి అని చురకలంటించారు. రేవంత్ దిల్లీ వెళ్లి చీకట్లో బిజెపి నేతల కాళ్లు పట్టుకుంటున్నారని, అమిత్ షాను రాత్రి కలిసిన రేవంత్ బయటికొచ్చిగట్టిగా మాట్లాడారని మండిపడ్డారు. నిందలు, దందాలు, చందాలు ఇదే రేవంత్ పని అని విమర్శలు గుప్పించారు. బిఆర్ఎస్ పై నిందలు, కాంట్రాక్టర్లతో దందాలు, దిల్లీకి చందాలు అని కేటీఆర్ దుయ్యబట్టారు. బిజెపి ఎంపిల భూదందాలకు సీఎం వత్తాసు పలుకుతున్నారని, బిజెపి నేతలు రాష్ట్ర కాంగ్రెస్ నేతలను ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. అందుకే నేషనల్ హెరాల్డ్ కేసుపై నేతలు మాట్లాడట్లేదని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే అన్ని అంశాలపై కేంద్రం చర్య తీసుకోవాలని కేటీఆర్ కోరారు. కేంద్రం స్పందన కోసం నెలరోజులు ఎదురు చూస్తామని, నెల తర్వాత పార్టీలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ దయ్యం రేవంత్ రెడ్డి ఈ దయ్యాన్ని, శనిని ఎలా వదిలించాలనేది మా టార్గెట్‌అన్నారు.

## ప్రతి కుటుంబానికి...
## ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్

**మొదటి పేజీ తరువాయి...**

ఉగ్ర దాడిని ఖండిస్తూ ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే అంశాలను తన ప్రజంటేషన్‌లో ప్రస్తావించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తన ప్రజంటేషన్‌లో చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖను తీర్చిదిద్దనున్నట్లు సీఎం వెల్లడిరచారు. విశాఖకు గ్లోబల్ హంగులు అద్దేలా నాలుగు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్,ఎఐ వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్టు స్పష్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో నీతి ఆయోగ్



గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కొనసాగుతోంది. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా అన్ని రాష్ట్రాల సీఎంలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన గవర్నర్‌లు, సీఎంతో ప్రధాని మాట్లాడారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివేదిక ఇచ్చారు.దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే వివిధ అంశాలను తన ప్రజెంటేషన్‌లో చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తన ప్రజెంటేషన్‌లో ఏపీ సీఎం ప్రస్తావించారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ఏపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు చంద్రబాబు వివరించారు.

## వికసిత భారత్ లక్ష్య సాధనలో కీలక భూమిక

**మొదటి పేజీ తరువాయి...**

సందర్భంగా ప్రస్తావించారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, వరల్డ్ క్లాస్ ఇన్ఫ్రా డెవలప్మెంట్, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తామన్నారు. 2047 నాటికి మన భారత దేశాన్ని సూపర్ పవర్ గా, నెంబర్ వన్ గా నిలబెట్టాలన్న మోదీ సంకల్పాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. వికసిత భారత్ ప్రణాళికను రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన 11వ నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. పహల్గాంలో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించి నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. 1971లో ఇందిరా గాంధీ నాయకత్వంలో పాకిస్థాన్ ను ఓడిరచి, ఆ దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చిన చరిత్రను గుర్తు చేశారు. తెలంగాణ సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు, ఎస్సీల ఉప వర్గీకరణకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి ఇప్పటికే వెల్ఫేర్ అండ్ సోషల్ జస్టిస్ పాలసీ, గ్రీన్ ఎనర్జీ పాలసీ, ఇన్ఫ్రా అండ్ ఇండస్ట్రియల్ పాలసీ,



టూరిజం పాలసీలను సిద్ధం చేసి కార్యాచరణలో పెట్టినట్లు చెప్పారు. అభివృద్ధిలో, సంక్షేమంలో ఆయా వర్గాలకు న్యాయమైన వాటా ఇవ్వాలన్నది తమ సంకల్ప మన్నారు. బీసీలకు విద్య, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ. ఈ రెండు చరిత్రాత్మక నిర్ణయాలను దేశంలోనే మొట్టమొదటగా తెలంగాణ అమలు చేయడం గర్వంగా ఉందన్నారు. దేశవ్యాప్త కుల గణనకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. కులగణనలో తెలంగాణ అనుభవాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఒకవైపు మానవ వనరులకు డిమాండ్ పెరుగుతున్నా మరోవైపు నిరుద్యోగ సమస్య నెలకొంది. నైపుణ్యాల కొరతే ఈ అంతరానికి కారణమని గుర్తించాం. అందుకే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ-, స్పోర్ట్స్ యూనివర్సిటీ పోలీస్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్, ఐటీఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరించి స్కిల్ శిక్షణ ఇస్తున్నామని సీఎం వివరించారు.

## కేరళను తాకిన రుతుపవనాలు

**తిరువనంతపురం మే 24(నిఘా న్యూస్):** నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయి. దాదాపు ఎనిమిది రోజులు ముందుగానే కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ శనివారం తెలిపింది. 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం ఇదే మొదటిసారి. చివరిసారిగా 2009, 2001 సంవత్సరాల్లో ఇంత త్వరగా రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. అప్పుడు మే 23న రాష్ట్రాన్ని రుతుపవనాలు తాకాయి. ఇప్పుడు 16 ఏళ్ల తర్వాత మళ్లీ ఇంత తొందరగా రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు వస్తాయి ఐఎండి ఇప్పటికే తెలిపింది. ఈ క్రమంలో శనివరాం ఉదయం నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని కేంద్ర వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో కేరళలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో రెండు రోజుల్లో రుతుపవనాలు విస్తరిస్తాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించనున్నాయి. 2009లో మే 23న రుతుపవనాలు ప్రవేశించాయి.

## జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**టియుడబ్ల్యూజె సర్కిల్ అధ్యక్షులు**
**జార్జ్ విల్సన్, ప్రధాన కార్యదర్శి గిరి గౌడ్ గడ్డమీది**

**మల్కాజిగిరి మే 24 (నిఘా న్యూస్):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మల్కాజ్గిరి సర్కిల్ టియుడబ్ల్యూజే అధ్యక్షులు జార్జ్ విల్సన్,ప్రధాన కార్యదర్శి గిరి గౌడ్ గడ్డమీది కోరారు. శనివారం మల్కాజిగిరి సర్కిల్ గాంధీ పార్క్ ప్రాంగణంలో ఉన్న మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ ఆవరణలో ఈనెల 31న టి జె ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రజతోత్సవ వేడుకల వాల్ పోస్టర్ ను స్థానిక జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలవేళ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్, హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరచలేదని పేర్కొన్నారు. ప్రెస్ అకాడమీకి కేటాయించి జర్నలిస్టులకు చేయూతనందిస్తూ మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు అధిక సాయాన్ని అందించాలని కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులపై శిత కన్ను వేస్తుందని ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించి విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బద్దల మురళీ కృష్ణ యాదవ్, అక్కల రాజేందర్ గౌడ్,వినోద్ ,పాండు గౌడ్, చేగుంట నరేష్ బాబు, సాయి కిరణ్ గౌడ్, శివ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వినోదం కోసం మమ్మల్ని వీధుల్లో తిప్పారు

**మొదటి పేజీ తరువాయి...**

తర్వాత 'ది సన్' న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ పోటీ నిర్వాహకులపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు తెలిసింది. పోటీ నిర్వాహకులు తనను ఓ వేశ్యగా చూస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేసింది. అంతేకాదు తనతో కొందరు అగౌరవంగా ప్రవర్తించారని చెప్పుకొచ్చింది. వినోదం కోసం మమ్మల్ని వీధుల్లో తిప్పారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు చాలా అసౌకర్యంగా అనిపించిందని చెప్పుకొచ్చింది. అందుకే మనస్తాపంతో పోటీల నుంచి తప్పుకున్నట్లు తన గోడును వెల్లబోసుకుంది. సమాజంలో మార్పు తీసుకురావడానికి, యువతలో స్ఫూర్తి నింపేందుకు నేను అక్కడికి వెళ్లాను. అయితే, అక్కడ పరిస్థితులు వేరు. కొందరిని సంతృప్తి పరిచేందుకు కోతుల్లా ప్రదర్శన ఇచ్చేందుకు మేం అక్కడున్నాం. అలాంటి పరిస్థితుల్లో ఉండాల్సి వస్తుందని నేను కలలో కూడా ఊహించుకోలేదన్నారు.

## దేశంలో మళ్లీ విజృంభిస్తున్న కరోనా

**మొదటి పేజీ తరువాయి...**

నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. దిల్లీలో కేసులతో అక్కడి భాజపా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, టెస్టింగ్ కిట్స్, వ్యాక్సిన్ల లభ్యత సరిచూసుకోవాలని సూచించింది. వివిధ రకాల శ్వాసకోశ వైరస్ కేసుల వివరాలను పొందుపర్చాలని ఆదేశించింది. వైరస్ వేరియంట్లలో కలిగే మార్పులు ప్రస్తుత వ్యాప్తికి సంబంధం ఉందని, దీంతోపాటు- ఇమ్యూనిటీ- తగ్గడం కూడా మరో కారణంగా పేర్కొంది. కొవిడ్ కొత్త వేరియంట్లు భారత్‌లో గుర్తించినట్లు- ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం శనివారం వెల్లడిరచింది. ఎన్‌బీ.1.8.1 రకం కేసు ఏప్రిల్‌లో బయటపడగా ఎల్‌ఎఫ్.7 కు సంబంధించి నాలుగు కేసులు మేలో గుర్తించినట్లు తెలిపింది. అవి తమిళనాడు, గ నమోదయ్యాయి. ఆసియా దేశాలు మరీ ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు- చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జ్వరం, ముక్కు కారడం, గొంతునొప్పి, తలనొప్పి, నీరసం వంటి స్వల్ప లక్షణాలు కనిపిస్తున్నాయని, బాధితులు నాలుగు రోజుల్లో కోలుకుంటున్నారని వైద్య నిపుణులు వెల్లడిరచారు. అయితే, ప్రస్తుతం ఆసియా దేశాల్లో కొవిడ్ వ్యాప్తికి కారణంగా భావిస్తున్న జేఎన్.1 రకం ఆందోళన కలిగించే రకం కాదని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇదివరకే స్పష్టం చేసింది.

## అందాల పోటీల్లో పాల్గొనే వారిని వేశ్యల్లా చూస్తున్నారు

**ఖమ్మం మే 24(నిఘా న్యూస్):** అందాల పోటీల సందర్భంగా మహిళలను కించపరిచారని పోటీల్లో పాల్గొన్న వారు ఆరోపిస్తుంటే ప్రభుత్వం ఇప్పుడు ఏమి సమాధానంచెబుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ప్రశ్నించారు. హైదరాబాద్ లో మిస్ వరల్డ్ 2025 పోటీలపై కమ్యూనిస్టు పార్టీగా స్పందిస్తూ అందాల పోటీలు మహిళలను కించపరిచేవిగా ఉన్నాయని అన్నందుకు కొందరు అవాక్కులు చేవాక్కులు పేలారని ఇప్పుడు మిస్ ఇంగ్లాండ్, మిల్లా సన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ పోటీల్లో పాల్గొనే వారిని వేశ్యల్లా చూస్తున్నారని ఆమె తెలిపిందని నారాయణ అన్నారు. అందాల పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన పార్టీల్లో ఒక టేబులు ఇద్దరు అందగత్తెలను కేటాయించారని ఆ టేబుల్ వద్ద కూర్చున్న అతిథులను అలరించాలని ఇటువంటిది ఎక్కడ లేదన్నారు.విలువలు లేని చోట తాను ఉండదల్చుకోలేదని ఆమె చెప్పిందని ఇప్పటికైనా అందాల పోటీ గురించి మాట్లాడుతున్న వారు తమ వైఖరి మార్చుకోవాలని నారాయణ అన్నారు. తనపై విమర్శలు చేసి వేటకారంగా మాట్లాడిన వారు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారని ఆయన ప్రశ్నించారు. అందాల పోటీలు నిర్వహించడమంటే మహిళలను కించపర్చడమేనని ఆయన మరోమారు స్పష్టం చేశారు.

## టీమ్ ఇండియాలాగ కేంద్రం రాష్ట్రాలు పనిచేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

రాష్ట్రాలముఖ్యమంత్రులు, గవర్నర్లు హాజరవ్వాలి. కానీ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గతంలో లాగానే ఈ కౌన్సిల్‌కి హాజరవ్వలేదు. ఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు నీతి ఆయోగ్ కి సంబంధించి కీలక సమావేశం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో జరిగిన ఈ సమావేశంలో 2047 వరకు అభివృద్ధి చెందిన భారతదేశ ప్రణాళికలపై చర్చించారు. ఈ సమావేశానికి ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యారు. ప్రధాని మోడీ వారితో టీ- తాగుతూ చర్చిస్తున్న ఫొటోలు కనిపించింది. జార□ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుతోనూ ప్రధాని మోడీ ముచ్చటించారు. ప్రతిపక్ష ముఖ్యమంత్రులను ప్రధాని మోడీ ఆప్యాయంగా పలకరించారు. మరో ఫోటోలో ప్రధాని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులను కలిసిన దృశ్యం కనిపించింది. చంద్రబాబు నాయుడు ఎన్డీఏ కూటమిలో భాగం. కానీ ప్రధాని మోడీ, ఎంకే స్టాలిన్‌కి మధ్య ఇటీవలి భాషా వివాదంపై వాడీవేడి రాజకీయం రాజుకున్న విషయం తెలిసిందే. భాషా వివాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కఠిన వైఖరి తీసుకున్నారు. చంద్రబాబు నాయుడు ఈ అంశంపై మిశ్రమ వైఖరిని కనబర్చినట్లు అనిపించింది.




## తెలంగాణకు ద్రోహం చేసిన బిజెపి

**హైదరాబాద్ మే 24 (నిఘా న్యూస్):** తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ, గోదావరి జలాలను ఎత్తుకు పోయేందుకు ఏపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఏం చేస్తున్నట్లని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రూ. 80 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం 50శాతం నిధులు, మిగతా 50శాతం ఎఫ్‌ఆర్‌బీఎం పరిధి మించి రుణ సమీకరణకు ఏపీకి అనుమతించడం అన్యాయం, అనైతికం అని హరీశ్‌రావు మండిపడ్డారు. విభజన చట్టం ప్రకారం, కృష్ణా లేదా గోదావరి నదులపై కొత్త ప్రాజెక్టులు నిర్మించాలనుకుంటే రివర్ మేనజ్మెంట్ బోర్డుల అనుమతి అవసరం. కానీ అందుకు విరుద్ధంగా, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే అడ్డుకోవాల్సిన కేంద్రం, నిధులిచ్చి సహకరించడం దుర్మార్గం అన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న తీవ్ర అన్యాయం అన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బిజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి ఏం లాభమని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకుంటే, ఎఫ్‌ఆర్‌బీఎం కింద రికవరీ పెట్టారు, కానీ బనకచర్ల విషయంలో మాత్రం అందుకు భిన్నంగా 50శాతం ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి మించి రుణం తీసుకునేందుకు పర్మిషన్ ఇచ్చారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ, ఆంధ్రప్రదేశ్‌పై వరాల జల్లులు కురిపిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. నాటి సమైక్య పాలకులు పోతిరెడ్డిపాడుతో కృష్ణా జలాల అక్రమ తరలింపుకు ప్రణాళిక వేస్తే, నేటి కాంగ్రెస్ నాయకుల సమక్షంలోనే బనకచర్ల ద్వారా గోదావరి జలాల దోపిడికి మార్గం సుగమం చేస్తున్నారు. కేంద్రాన్ని నిలదీయలేరు, ఏపీతో పోరాటం చేయలేరు. నీతి అయోగ్ సమావేశానికి హాజరవుతున్న ముఖ్యమంత్రి ఏపీ అక్రమ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించి, ఏపీ జల దోపిడిని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## వైసీపీ ఛీత్కారాలను మరిచిన చిత్ర సీమ

**మొదటి పేజీ తరువాయి...**

వ్యక్తిగత చర్చలు ఉండవని, సినిమా సంఘాల ప్రతినిధులే రావాలని స్పష్టం చేసింది. కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు.. సినిమా రంగం అభివృద్ధినే చూస్తుంది. ఏపీలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు. ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారి కూడా మర్యాదపూర్వకంగా కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం సంఘటితంగా రాలేదు. అందరూ కలసి రావాలి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించినా సానుకూలంగా స్పందించలేదు. తెలుగు సినిమా రంగంలోని అగ్ర నటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఛీత్కరించి, ఇక్కట్ల పాలు చేసిందో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్స్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరిచి పోయినట్లున్నాయి. రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకూడదు. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. కక్ష సాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో తహసీల్దార్లను థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులుపెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పిన విధంగానే కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందినవారి చిత్రం విడుదలైనప్పుడు సైతం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డవారు ఇబ్బంది పడకూడదు అనేదే కూటమి ప్రభుత్వ విధానం. తెలుగు సినిమా రంగంవారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధర పెంచమని కోరడం ఎందుకు అందరూ కలసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు. దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా చెప్పారు. అయినా ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. సినిమా రంగానికి పరిశ్రమ హోదా ఇచ్చేందుకు ఆలోచనలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. తెలుగు సినిమాకి చెందిన కొందరు ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్‌ను కూడా తగిన విధంగానే స్వీకరించాలని నిర్ణయించుకున్నారని పేర్కొంది.



అంబర్ పేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు అమెరికాలో ఎంఎస్ డిగ్రీలు అందుకున్నారు. జస్వాల్ గార్డెన్ కు చెందిన సీనియర్ బిజెపి నాయకుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, పుష్పలత దంపతులకు కుమార్తె చింతల శ్రీకర్ణి మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లో, కుమారుడు చింతల సాయి ఆదిత్య మాస్టర్ ఆఫ్ సైన్స్ హాస్పిటలటీ మేనేజ్మెంట్ లో ఎమ్మెస్ డిగ్రీలు సాధించారు. అమెరికా యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సస్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరూ డిగ్రీలు అందుకున్నారు.

– అంబర్‌పేట మే 24(నిఘా న్యూస్):

## సీబీఎస్ఈ ఆధ్వర్యంలో టీఓటీ సర్టిఫికేషన్ కోర్సు



**హైదరాబాద్, మే24 (నిఘా న్యూస్):** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్(ఐఎస్‌టీఎం), కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ)లతో కలిసి సీబీఎస్ఈ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్(టీఓటీ) సర్టిఫికేషన్ కోర్సు నగరంలోని ద గౌడియం స్కూల్లో శనివారం ప్రారంభమైనట్లు గౌడియం స్కూల్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ కీర్తిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ విద్యావిధానం 2020 ఫ్రేంవర్క్ ప్రకారం ఉపాధ్యాయులు సీఈఎస్ఈ రిసోర్స్ పర్సన్లుగా పనిచేసేందుకు ఈ టీఓటీ కోర్సు ఉపయోగ పడుతుంద న్నారు. ఏపీ, తెలంగాణల నుంచి 76 మంది హాజరైనట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



**మల్లాపూర్ మే 24(నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్‌కి సంబంధించిన ఎండీ.మిస్బా అనారోగ్య సమస్యతో బసవతారకం ఆసుపత్రిలో చికిత్స చేయించాలని కాంగ్రెస్ నాయకులు తెలియజేయడంతో అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద ఎల్ఓసి ద్వారా ఐదు లక్షలు రూపాయలు మంజూరు చేయించి శనివారం ఎల్ఓసి పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్, శ్రీకాంత్ రెడ్డి, పర్వతాలు పాల్గొన్నారు.

## తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికునికి తీవ్ర గాయాలు



**హుజురాబాద్, మే 24 (నిఘా న్యూస్):** హుజురాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బాలగోని రాములు(55) శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో హుజురాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. రాములు చెట్టుపై నుండి పడడంతో ప్రస్తుతం జీవనోపాధి గీత కార్మిక వృత్తికి దూరమయ్యాడని, రెక్కాడితే గాని డొక్కా ఆడని పరిస్థితి ఉన్నందున ప్రభుత్వం రాములు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## దివ్యమూర్తుల యంత్రాలకు మూలమంత్ర జపాలు



**శివంపేట, మే 24 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా శివంపేట మండలం గూడూర్ గ్రామంలోని శ్రీగురు పీఠంలో ప్రాణ ప్రతిష్ట చేయనున్న దివ్యమూర్తుల యంత్రాలకు సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో లక్షగాయత్రి దత్తాత్రేయ మూలమంత్ర సహిత జపాలు, గాయత్రీ సహిత శ్రీ సాయినాథ మూలమంత్ర సహిత జపాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో వీటిని సికింద్రాబాద్‌లోని శ్రీ విశ్వ శ్రీ నిలయానికి చేర్చారు. ఈ విషయాన్ని శ్రీగురు పీఠం ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ యంత్రాలకు విశ్వశ్రీ నిలయంలో నిత్య దీపారాధన జరుగుతుంది. వచ్చే నెల రెండో తేదీన వీటిని తిరిగి గూడూరులోని శ్రీగురుపీఠానికి తరలిస్తారు. ఈ మహత్తర కార్యక్రమంకోసం గౌరవ ట్రస్ట్ సభ్యులు రమాదేవి, జిన్నారం సూర్య కుమార్ గౌడ్, జిన్నారం శ్రీనివాస్ గౌడ్, ఎల్లమ్మ గూడెం రాజా రమణ గౌడ్, పబ్బ మహేష్ గుప్తా, శాస్త్రుల వామన శర్మ, శ్రీ మారెళ్ళ మోహన్ రావు, నోముల హనుమంతు, రాజ్యం, బిక్షపతి నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రాణప్రతిష్ట వేడుకలకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో వైరా మున్సిపాలిటీ

- ఉపాధి పనులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సిపిఐ(ఎం) వినతి
- వైరా అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడతాను
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ



**ఖమ్మం, మే 24 (నిఘా న్యూస్):** వైరా మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. సిపిఐ (ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం బృందం శనివారం వైరాలో జరిగిన జాబ్ మేళాలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వైరా నియోజకవర్గ కేంద్రంలోని మౌలికమైన సమస్యలు పరిష్కారానికి నిధులు కేటాయించాలని, ఏన్కూర్ మండలంలో సీతారామ ప్రాజెక్టు లింకు కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు పెండింగులో ఉన్న నష్టపరిహారం డబ్బులు విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ 2018 ఆగస్టు 2న సోమవారం మేజర్ గ్రామ పంచాయతీలో ఐదు గ్రామాలను విలీనం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైరా మున్సిపాలిటీని ఏర్పాటు చేసి నేటికీ ఆరు సంవత్సరాల తొమ్మిది నెలల 22 రోజులు కావస్తుందని, నాటి నుండి నేటి వరకు వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నదని, మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత ఉపాధి పనులు లేక గ్రామీణ ప్రజలు ఉపాధిని కోల్పోయారని, ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు లేక వర్షాకాలంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కావున వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. అదేవిధంగా మధిర రోడ్డులో ఇందిరమ్మ కాలనీకి కరకట్ట నిర్మాణం చేపట్టాలని, మున్సిపాలిటీ పరిధిలో మిడిల్ కరెంట్ పోల్స్ వేయాలని, హనుమాన్ బజార్, బీసీ కాలనీ స్మశాన వాటిక రోడ్డు ఏర్పాటు చేయాలని, పల్లిపాడు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద శాశ్వత డ్రైనేజీ నిర్మాణం చేయాలని, వైరా రింగ్ రోడ్డు నుండి కొత్తగూడెం రోడ్డు ఐ.బి కాల్వ వరకు ఇరుప్రక్కలా డ్రైనేజీ నిర్మించాలని, వైరా రింగ్ రోడ్డు నుండి మధిర రోడ్డుకు ఐ.బి కాల్వ వరకు ఇరుప్రక్కలా డ్రైనేజీ నిర్మాణం ఏర్పాటు చేయాలని, దళితులు ఎక్కువగా ఉన్న వైరా నియోజకవర్గ కేంద్రంలో కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని, అసంపూర్తిగా ఉన్న షాదీఖానా, గిరిజన భవనంలను నిర్మించాలని, అసంపూర్తిగా ఉన్న వెజ్ మార్కెట్ పనులు ప్రారంభించాలని వైరా నియోజకవర్గ కేంద్రంలోని పలు రకాల సమస్యలను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వివరించారు. ప్రత్యేక నిధులను మంజూరు చేసి సమస్యలను పరిష్కరించాలని, ప్రారంభించిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతానని, ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేకంగా అదనపు నిధులు మంజూరు చేపించి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని, సీతారామ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా డివిజన్ కమిటీ సభ్యురాలు మచ్చా మణి, సీనియర్ నాయకులు పారుపల్లి కృష్ణారావు, వైరా పట్టణ కమిటీ సభ్యులు కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్ రావు రైతులు బాణోత్ రవి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### బండారి రాజిరెడ్డి బాటలో నడుస్తా..
## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మౌలాలి, మే 24 (నిఘా న్యూస్): నిబద్ధత కలిగిన నాయకుడు తన సోదరుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డిని కోల్పోవడం బాధాకరమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం వేంకటేశ్వర నగర్ మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని సాయి బాబా దేవాలయం లో ట్రస్ట్ బోర్డ్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సంతాప సభలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.

అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు దివంగత నేత బండారి రాజిరెడ్డి ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని ఆయన అన్నారు. తను కూడా తన సోదరుని బాటలో నడుస్తూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు జంపాల్ రెడ్డి, నాదం చారి, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వప్న కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

### తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక కన్వీనర్ మద్దెల



**హైదరాబాద్, మే 24 (నిఘా న్యూస్):** తెలంగాణ ఉద్యమ కళాకారిణి మహబూబ్ నగర్‌కు చెందిన నట్టల స్వప్న కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ మద్దెల నర్సింలు ప్రభుత్వాన్ని కోరారు. కళాకారుల అలుపెరగని పోరాటానికి ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కళాకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. ఇంతవరకు కళాకారులకు ఉద్యోగాలు కనిపించడంలో విఫలమవుతున్న ఈ ప్రభుత్వం ఒక ఉద్యమ కలమ్మ తల్లి ముద్దుబిడ్డని బలి తీసుకోవడం దురదృష్టకరమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ నేతలు కళాకారుల బతుకులు మాకు తెలుసు అంటూ ఎన్నో మోసపూరితమైన మాటలు చెప్పి నేటికీ కళాకారులను అగౌరవ పరుస్తూనే ఉన్నారన్నారు. ఇకనైనా ఉద్యమ కళాకారులకు ఇచ్చినటువంటి మాటను నిలబెట్టు కోవాలని, లేని పక్షంలో రాబోవు రోజుల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

## సకల జీవులను తరింపజేస్తున్న రామ చరిత్ర



### తీతీదే కార్య నిర్వాహకులు వెంకటరెడ్డి

**కర్నూలు/మిడుతూరు, మే 24 (నిఘా న్యూస్):** శ్రీరాముని దివ్యమైన గుణాలను వినిన, గానంచేసిన సకల జీవులకు సద్గతి ప్రాప్తిస్తుందని, రామకథను ఎన్ని సార్లువిన్నా, ఎన్నిసార్లు చదివినా ఇంకా తెలుసుకోవాలనే కాంక్ష కలుగడానికి శ్రీరాముడిలో ఉన్న ధర్మనిష్టనే కారణమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి ద్దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మిడుతూరు మండలం, కలమందలపాడు గ్రామంలోని శివాలయం నందు గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాల మగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై తెలుగు కల్లం సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి చేసిన సంగీతోపన్యాసాలు భక్తులను పరవసింపచేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు తేజేశ్వరరెడ్డి, రామేశ్వరరెడ్డి, పూజారి మహేశ్, వెంకటేశ్వర్లు, ఎల్.నాగన్న, బాబు, శ్రీనివాసులు, నాగార్జునతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రాంపల్లి శ్రీనివాస్ ఎన్ఎస్సి రాజపేట మండల అధ్యక్షులు సోదరి వివాహ వేడుకల్లో నవ దంపతులను ఆశీర్వదించిన రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమిలి మహేందర్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ నాయకులు నమిలే కేదార్ గౌడ్,గౌరీ చిన్న బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

– రాజపేట, మే 24 (నిఘా న్యూస్):



సినిమా చూపిస్తా మామా', నేను లోకల్', ధమాకా వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు త్రినాథ్ రావు నక్కిన, యువరాజకీయ నేత, వ్యాపారవేత్త గడ్డం రవి కుమార్ అహోబిలం మఠాన్ని దర్శించి శ్రీ జ్వాలా నరసింహ స్వామి వారిని దర్శించుకొని స్వామివారి ఆశీర్వాదాన్ని పొందారు. ఈ సందర్భంగా త్రినాథ్ రావు మాట్లాడుతూ నరసింహ స్వామిని దర్శించుకోవడం మనసుకు ప్రశాంతతను కలిగించింది అని పేర్కొన్నారు.

– హైదరాబాద్, మే 24 (నిఘా న్యూస్):

## టీజేఎఫ్ రజతోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

### టీ యూ డబ్లు జె హెచ్143 జర్నలిస్టు యూనియన్



**హుజురాబాద్, మే 24 (నిఘా న్యూస్):** టీయూడబ్లు జె హెచ్143 జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో శనివారం హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి చేతుల మీదుగా టీజేఎఫ్ రజతోత్సవ వేడుక పోస్టర్ ఆవిష్కరణ చేశారు, ఈనెల 31న హైదరాబాద్ జలవిహార్ ఆడిటోరియంలో తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో తెలంగాణ జర్నలిస్టు ఫోరం నిర్వహించనున్న టీజేఎఫ్ రజతోత్సవ వేడుక కు భారీ ఎత్తున జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని హుజురాబాద్ టీ యూ డబ్లు జె హెచ్143 యూనియన్ టీజేఎఫ్ 25 వసంతాల సంబరం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడహక్ కమిటీ కన్వీనర్ గూడూరి కొండల్ రెడ్డి, కో కన్వీనర్లు కోయల్ కార్ శ్యామ్, కనకం శ్రీనివాస్, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మండల యాదగిరి, జర్నలిస్టులు, మధుకర్, సబ్బని వెంకటేష్, నరేష్ సుంకరి రాజమౌళి, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్‌లో సాత్వికకు స్టేట్ ఏడవ ర్యాంకు



**ధర్మపురి, మే 24(నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండల కేంద్రంలో కెవిఎంఎస్ సాఫ్ట్ టెక్, ఎన్.ఏ.సి.డబ్ల్యూ అకాడమీలో విద్యార్థులు ఎంట్రన్స్ పరీక్షలలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు కెవిఆర్ విద్యార్థిని విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్షల కొరకు నాణ్యమైన విద్యతో కోచింగ్ ఇస్తున్నారు. వారి ఇనిస్ట్యూట్‌లో కోచింగ్ తీసుకున్న విద్యార్థిని పి.సాత్విక ఇటీవల విడుదలైన టీజీఆర్జెసిలో రెండవ ర్యాంకు సాధించింది. టీజీ పాలిసెట్‌లో 119/120 మార్కులతో రాష్ట్రంలో 7వ ర్యాంకు సాధించింది. బి.అమృతలక్ష్మి 674,పి.శ్రీహిత 831వ ర్యాంకు సాధించారు. విద్యార్థులను కె.వి.ఆర్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ఇనిస్ట్యూట్ మీద నమ్మకంతో విద్యార్థులను చేర్పించినటువంటి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కోచింగ్ సెంటర్ లో ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మేము అందించే పోటీ పరీక్షల శిక్షణను విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రానున్న వర్షాకాలాన్ని పురస్కరించుకొని జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ వరద నీటి కాలువలో చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించిన కాచిగూడ కార్పొరేటర్ కన్నె కుమార్ రమేష్ యాదవ్.

- అంబర్‌పేట, మే 24(నిఘా న్యూస్)



అశోక్ నగర్ వద్ద సాగర్ వరద నీటి కాలువలో రూ. 14 లక్షల రూపాయలతో చేపట్టిన పూడిక తీత పనులను హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం సందర్భంగా హుస్సేన్ సాగర్ నాలాలో వరద నీరు సవ్యంగా వెళ్లేలా పూడికతీత పనులు చేపడుతున్నట్లు చెప్పారు. చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ పవన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రియరాజ్, పూర్ణచందర్, మహేష్, సర్ఫరాజ్, శ్రీనాథ్, జైస్వాల్, భాష, సందీప్, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

- హిమాయత్‌నగర్, మే 24 (నిఘా న్యూస్):

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్సీ

### హాజరైన గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి



**తూప్రాన్, మే 24 (నిఘా న్యూస్):** తూప్రాన్ మండల కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎం ఎల్ సి. యాదవ రెడ్డి అధికారికంగా హాజరై 163 చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు, వీరితో పాటు కాంగ్రెస్ మాజీ ఎంఎల్ఏ. నరసారెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందని వారన్నారు, ఇందులో కాంగ్రెస్ నాయకులు, ఎలక్షన్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ నేతలు పల్లెర్ల రవీంద్ర గుప్తా, భగవాన్ రెడ్డి, మామిళ్ళ కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు గౌడ్, జింక కృష్ణ, విశ్వరాజ్, సందాని, హైమద్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



**మనోహరాబాద్, మే 24 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో నూతన సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి. వీరితోపాటు గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, మాజీ ఫుడ్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి లు ఉన్నారు, 15 లక్షల ప్రభుత్వ నిధుల చేత సీసీ నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు పనిచేయుటకు చిత్తశుద్ధితో ఉన్నారని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోయే సంకల్పం గల నాయకుడని వారన్నారు. ఇందులో ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిటిసి ర్యాకల కృష్ణ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ చైర్మన్ విట్టల్ రెడ్డి, శోభన్ రాజ్ గౌడ్, పవన్ గౌడ్, అజయ్ గౌడ్, ఎల్ శ్రీనివాస్ గౌడ్, రాజు యాదవ్, లక్ష్మీ నరస గౌడ్, మాజీ సర్పంచ్ పెంటయ్య, అశోక్, తదితరులు ఉన్నారు.

## తూప్రాన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



**తూప్రాన్, మే 24 (నిఘా న్యూస్):** తూప్రాన్ ఉమ్మడి మండలాల కార్యకర్తల సమావేశానికి మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు విచ్చేశారు. వీరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మెదక్ జిల్లా ఇన్చార్జ్ లు మెట్టు సాయికుమార్ వరప్రసాద్ విచ్చేసి కార్యకర్తల సమస్యలు విని పార్టీలో పనిచేసే కార్యకర్తకు సమ న్యాయం చేస్తామని హామీ ఇచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు చిటుకుల మైపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, యూత్ అధ్యక్షులు శశిభూషణ్ రెడ్డి, నవీన్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ, సాక్స్ డైరెక్టర్ జావిద్ భాషా, నాగరాజు గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

# ద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలవాలి

### ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్, మే 24 (నిఘా న్యూస్):** ఉప్పల్ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తిపరమైన శిక్షణను అందుకొని మన ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల భవిష్యత్తుకు తన వంతుగా ఎలాంటి సహాయమైనా ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చే పేద విద్యార్థులకు వారి తల్లి దండ్రుల ఆరోగ్య విషయాల పట్ల ఏ విషయానికైనా సహాయం అందించడానికి ముందుంటానని తెలియజేశారు.

ఎవరైనా పేద విద్యార్థులు ఎంబిబిఎస్ చదువుకోవాలని తన వద్దకు వస్తే వారికి ఆర్థిక సహాయం అందిస్తానని ప్రభుత్వ పాఠశాలలు మన మండలంలో ఏ పాఠశాలకి ఏ అవసరం వచ్చినా మౌలిక వసతులు తీర్చడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని వివిధ పాఠశాలల అభివృద్ధికి విద్యాశాఖ అధికారుల తోటి తరచుగా సంప్రదించడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే మండలంలోని కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి విద్యా వాలంటీర్లను అందించడం జరుగుతుందని తెలియజేశారుఉపాధ్యాయులు వేసవి సెలవులలో కూడా సొంత అవసరాలను మానుకొని విద్యార్థులకు మంచి విద్యను అందించడం కోసం ఇలా వేసవిలో కూడా శిక్షణను తీసుకుంటున్నందుకు ఉపాధ్యాయులందరిని అభినందించారు. మీరు రేపు నేర్చుకున్న అంశాలన్నింటినీ మన పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి భవిష్యత్తుకు పునాదులు వేస్తారని ఆశిస్తున్నామని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలలకు ఎమ్మెల్యేగా తన సహాయం సహకారాల అందించడానికి ముందుకు వచ్చినందుకు వారికి మండల విద్యాశాఖ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు లబ్ధి



**మనోహరాబాద్, మే 24 (నిఘా న్యూస్):** ఆయిల్ పామ్ పంట సాగుతో రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని లివ్ పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ నిశాంత్ అన్నారు. శనివారం మనోహరాబాద్ మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు వరి, మొక్క జొన్న, పత్తి పంటల్లో స్వల్ప కాలికంగా ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ దీర్ఘకాలికంగా రైతు ఆదాయం పెరగాలంటే తప్పని సరిగా ఆయిల్పామ్ సాగుతోనే సాధ్యమన్నారు. ప్రభుత్వం డ్రిప్‌కు, మొక్కలకు అధిక మొత్తంలో రాయితీలను ఇవ్వడం వలన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టాలని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగు చేయడం వలన నాటిన మూడు సంవత్సరాల తరువాత నుండి 35 సంవత్సరాల వరకు నిరంతర ఆదాయం ప్రతి నెలకి పొందవచ్చు, పంట సాగుకు ప్రభుత్వ రాయితీలు అనగా పంట సాగుకు కావాల్సిన డ్రిప్ ఎకరాకి ఎస్సీ ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ, బిసి, ఓసి వాళ్ళకి 90 శాతం సబ్సిడీ అందించడం జరుగుతుంది. అలానే పంట సాగుకు ఒక ఆయిల్ పామ్ మొక్క కేవలం 20 రూపాయలకు మాత్రమే సబ్సిడీలో పొందవచ్చు, ఏ పంటకు లేనివిధంగా ఈ పంటలో రైతులు ఎకరానికి 4,200 రూపాయలు ప్రతీ సంవత్సరం ఉద్యాన శాఖ అంతర పంటల సాగుకు అందిస్తుంది, పంట ఫలసాయం మధ్య దళారీలు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కంపెనీ వారిచే నేరుగా కొనుగోలు చేసిన తర్వాత 10 రోజుల్లో పేమెంట్ రైతుల ఖాతాలో నేరుగా జమ చేయ బడుతుందని అంతర పంటల ద్వారా ఆదాయం వరి తప్పించి ఏ పంటటైన అంతర పంటగా వేసుకోవచ్చు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ సదస్సులో వ్యవసాయ అధికారి స్రవంతి, రైతులు తదితరులు ఉన్నారు.

# ప్రజా పోరాటాలతోనే పార్టీ విస్తరణ సాధ్యం

### నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి వేడుకల్లో రవిబాబు



**మధిర, మే 24 (నిఘా న్యూస్):** జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు భావజాలం విస్తరిస్తోంది,ఇది పేదవర్గాలు,కార్మికులు, కర్షకుల అభ్యున్నతికి మలిచే భాధ్యతను సీపీఐ స్వీకరిస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు అన్నారు.శనివారం మండల పరిధితో తొండల గోపవరం గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి వేడుకలను ఆయన స్మారక స్తూపం వద్ద సిపిఐ మధిర మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్మారక స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని బెజవాడ రవిబాబు ఆవిష్కరించగా,సిపిఐ జిల్లా నాయకులు ఎంఏ రహీం స్థూపానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా బెజవాడ రవిబాబు మాట్లాడుతూ నల్లమల గిరి ప్రసాద్ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేశారు. వామపక్ష వాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళందుకు పట్టువిడవకుండా ఆయన ఎన్నో ప్రయోగాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంకోసం ప్రజాపోరాటాలు నిర్మించడం ద్వారానే పార్టీ విస్తరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాష్ రావు, చెరుకూరి వెంకటేశ్వరరావు, మడుపల్లి లక్ష్మణ్, తలారి రమేష్, అన్నవరపు సత్యనారాయణ, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో టిపిసిసి అధ్యక్షుడి జన్మదిన వేడుకలు




**హుజురాబాద్, మే 24(నిఘా న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో గల స్పందన అనాధాశ్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు వావిలాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వానరాశి జాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు మాట్లాడుతూ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కార్యకర్త నుండి మొదలైన తన రాజకీయ ప్రస్థానం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షునిగా, యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీకి గొప్పగా సేవలందించినందుకు గాను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా శాసనమండలి సభ్యునిగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తకు ఏదో ఒక రోజు గొప్పగా అవకాశం వస్తదనడానికి ఉదాహరణ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అని రానున్న రోజులలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలు సహకార సంఘాల ఎన్నికలు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో గొప్పగా ముందుకెళ్లి విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పుల సాంబశివరెడ్డి జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిలువేరి రాజమౌళి యువజన కాంగ్రెస్ మడిపల్లి గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు ల్యాదల వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ సందాని తూర్పాటి రాజు సోమిడి అభిలాష్ తూర్పాటి జస్వంత్ వానరాశి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

### ముధోల్ నియోజకవర్గం సమన్వయ సభ్యులు లోలం శ్యాంసుందర్



**ముధోల్, మే 24 (నిఘా న్యూస్):** గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న బలమైన గాలులతో కూడిన వర్షానికి కొనుగోలు కేంద్రాలతో పాటు రైతుల కల్లాలపై తడిసిన ధాన్యం, జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం లోకేశ్వరం మండల కేంద్రంలో బిఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ లోలం శ్యాంసుందర్ మాట్లాడుతూ గత ఐదు రోజులు నుండి కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికొ చ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తరలించి అక్కడ కొనుగోళ్లలో జాప్యంతో ఉత్పత్తులు వర్షాలకు తడిసి పోయి రైతులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి లారీలను అందుబాటులోకి తీసుకువచ్చి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి తడిసిన ధాన్యం, జొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని లేని పక్షంలో బి ఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో రైతుల తరపున ఆంధోళనలు చేస్తామని హెచ్చరించారు.

## బీరప్ప గడ్డలో కార్పొరేటర్ బన్నాల పర్యటన



**చిలుకానగర్, మే 24 (నిఘా న్యూస్):** చిల్కానగర్ డివిజన్‌లోని బీరప్ప గడ్డ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదురుగా ఉన్న వీధులలో స్ట్రామ్ వాటర్ డ్రైన్, సిసి రోడ్ల కొరకు బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ బన్నాల గీతాను వేయాల్సిందిగా కోరడం జరిగింది. వెంటనే స్పందించిన కార్పొరేటర్ గీత జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి బీరప్ప గడ్డలో సుడిగాలి పర్యటనలో భాగంగా అధికారులకు నూతన స్ట్రామ్ వాటర్ డ్రైన్, నూతన సిసి రోడ్ల కోసం ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా ఆదేశించడం జరిగింది. అనంతరం బస్తీ వాసులకు సుమారు రెండు నెలల వ్యవధిలో స్ట్రామ్ వాటర్ డ్రైన్, కొత్త సిసి రోడ్ల పనులు పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు డి.ఈ. వెన్నెల్ గౌడ్, ఏ.ఈ. రాధిక ,వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కోకుండా జగన్, బీరప్ప గడ్డ అసోసియేషన్ సభ్యులు, సత్యనారాయణ ఇంద్రసేనారెడ్డి, బాలు, మార్గ శీను గణేష్ ముఖ్యంగా బస్తీ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉప్పల్ శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు



**ఉప్పల్, మే 24 (నిఘా న్యూస్):** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం కుమారి సుప్రియ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో జయము జయము, శ్రీవిఘ్నరాజం భజే, ముద్దుగారే యశోద, మూషిక వాహన, కృష్ణ శబ్దం, బాల గోపాల తరంగం, సీత కళ్యాణం, లలిత హారతి మొదలైన అంశాలను సంయుక్త, యశ్విక, మోక్షిత, యువిక, దక్ష, ఈక్షిత, సమీక్షా, హ్యాండావి, సున్నిత, సుకీర్తి, మనస్వి, ప్రణీత, మోక్షిత, చతురశ్రీ, యశస్వినీ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## పెబ్బేరులో ఉపాధ్యాయ శిక్షణ తరగతులు



**పెబ్బేరు, మే 24 (నిఘా న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్ఎల్ఎన్ పై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా పెబ్బేరు మండల కేంద్రంలో నాలుగో రోజు శిక్షణా తరగతులు కొనసాగాయి. శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతరంలో ఏ విధంగా బోధించాలో మెలికువలు నేర్చుకోవడం జరిగింది. ఇట్టి శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందిన తరువాత నేర్చుకున్నటువంటి ప్రతి అంశాన్ని తరగతి గదిలో వినియోగించినప్పుడే ఈ శిక్షణ కార్యక్రమాలు విజయవంతం అవుతాయని మండల విద్యాధికారి ఎస్.జయరాములు తెలిపారు.



నల్లకుంట డివిజన్ లోని రత్నానగర్, సత్య నగర్ బస్తీలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ అమృత, అధికారులతో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో కొత్తగా నిర్మించిన నూతనంగా కమ్యూనిటీ హాల్ ను కేంద్ర మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్రమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్ రావు, అంబర్ పేట కన్వీనర్ శ్యామ్ రాజ్, సికింద్రాబాద్ పార్లమెంట్ బిజెపి సంయుక్త కన్వీనర్ ఎడెల్లి అజయ్, పార్టీ నాయకులు మధుసూదన్ యాదవ్, పాతకోటి మహేష్, క్రాంతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

– నల్లకుంట, మే 24 (నిఘా న్యూస్):

## పీసీసీ అధ్యక్షుడికి నేతల జన్మదిన శుభాకాంక్షలు



**రామంతాపూర్, మే 24 (నిఘా న్యూస్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, తెలంగాణ శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ జన్మదినం సందర్భంగా గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యేలు, సహచర నాయకులతో కలిసి రామంతపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆవుల గడ్డ శ్రీనివాస్ యాదవ్, మహేష్ కుమార్ గౌడ్ ను ఘనంగా సన్మానించి కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో బీసీలకు సరైన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీలో పని చేసే బీసీ సీనియర్ నాయకులకు అందరికీ సముచిత స్థానం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కనకయ్య తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు



**పెబ్బేరు, మే 24 (నిఘా న్యూస్):** వరి కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం పెబ్బేరు మార్కెట్ యార్డు,చెలిమిళ్ళ, వెంకటాపూర్, అయ్యవారిపల్లి వరి కొనుగోలు కంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. వరి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, తేమ శాతం సరిగ్గా వచ్చిన వడ్లను తూకం చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. లారీలు వచ్చిన వెంటనే ధాన్యాని మిల్లులు, గోదాములకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. అకాల వర్షాలు పడుతుండటంతో వడ్లు తడచిపోకుండా టార్పాలిన్ కప్పాలని నిర్వాహకులను ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ప్రతి కొనుగోలు కేంద్రానికి లారీలు ప్రతిరోజూ వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉన్న శ్రీరంగాపూర్ కొనుగోలు కేంద్రం సి.ఇ.ఒ కు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు.

## పెబ్బేరు తహసీల్దార్‌గా మురళీ గౌడ్



**పెబ్బేరు, మే 24 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండల నూతన తహసీల్దార్ గా మురళీ గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ లక్ష్మీ బదిలీపై గద్వాల జిల్లాకు వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ మురళీ గౌడ్ మాట్లాడుతూ భూభారతి, ఇతర సర్టిఫికెట్లు, వివిధ అవసరాల కోసం వచ్చేవారు నేరుగా తనను కలవొచ్చని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కాగా డిప్యూటీ తహసీల్దార్ నంద కిషోర్ తో పాటు ఆర్ఐ రాఘవేంద్ర రావు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆసుపత్రి సేవల పట్ల..

# ప్రజల్లో నమ్మకం పెంచాలి

### ఎంజీఎం ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే నాయిని, ఎమ్మెల్సీ సారయ్య



**వరంగల్, మే 24 (నిఘా న్యూస్):** ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలకు వైద్య రంగంలో మెరుగైన సేవలు అందిచే తల్లి లాంటిది ఎంజీఎం ఆసుపత్రి అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, కూడా చైర్మన్ ఇనగల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డుల్లో మొదటగా పర్యటించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అత్యవసర సేవ విభాగంలో ఉన్న ఎక్స్ రే, ల్యాబ్, ఆక్సిజన్ స్టోర్, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ లను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న భోజనం, బోజన శాల డైట్ పరిశీలించారు. పురుషుల, మహిళల వార్డులను,ఫార్మసీ స్టోర్, చిన్నపిల్లల అత్యవసర విభాగ కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో పలు వార్డులలో అపరిశుభ్రంగా ఉండటం,వైద్యులు సిబ్బంది అందుబాటులో లేకపోవడం,రిజిస్టర్ లను సరిగా ఉంచుకోక పోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయా వార్డుల ఇంచార్జ్‌లపై అసహనం వ్యక్తంచేశారు. పేద,మధ్యతరగతి ప్రజలకు గుండె లాంటి ఆసుపత్రిని బాధ్యతాయుతంగా ఉంచకపోవడం చాలా బాధాకరమని అన్నారు. ప్రతి ఒక్క సిబ్బంది, వైద్యులు,అధికారులు నైతిక బాధ్యతగా వ్యవహరించి ఆసుపత్రి పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించాలన్నారు. ప్రజలకు సేవ విషయంలో,ఆసుపత్రి నిర్వహణ పట్ల అభద్రతా భావం కలిగిన వారిని వెంటనే విధులనుంచి తప్పించాలని, పని చేయలేని పక్షంలో స్వచ్ఛందంగా బదిలీలపై వెళ్లొచ్చు అని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎమ్ఓ వైద్యులు ఉన్నారు.

## చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావుకు వినతి పత్రం అందజేత

### టిడిపి నేత మచ్చా దొరస్వామి నాయుడు



**చంద్రగిరి, మే 24(నిఘా న్యూస్):** ఆ తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం లోనే విద్యుత్ రెవిన్యూ కార్యాలయము కొనసాగించాలని పాకాల కు చెందిన టిడిపి నేత మచ్ఛా దొరస్వామి నాయుడు,స్థానిక ప్రజలు చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావును శనివారం కిలిసి వినతి పత్రం అందజేసి విన్నవించుకున్నారు. విద్యుత్ రెవిన్యూ కార్యాలయ పరిధిలో పాకాల, పెనుమూరు, పులిచెర్ల, పూతలపట్టు, ఐరాల మండలాలు ఉండేవని,అవి దశలవారీగా మండలాలను తొలగిస్తూ ప్రస్తుతము పాకాల మండలము మాత్రమే, కార్యాలయ పరిధిలో నడుస్తున్నది తెలియజేశారు. మండలంలోని రైతులు, ప్రజలు విద్యుత్ బిల్లుల రాయితీ, సర్వీసు పేరు మార్పులు చేసుకోవాలన్నా, మీటర్ రద్దు పరచుకోవాలన్నా ఈ కార్యాలయములోనే పని పూర్తి అయ్యేదని అన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం4 వరకు సిబ్బంది అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాన్ని మాత్రమే నడుపుతున్నారు. కార్యాలయాన్ని చంద్రగిరి నుండి తిరిగి పాకాల మండల కేంద్రముకు తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని చిత్తూరు ఎంపీని మచ్ఛా దొరస్వామి నాయుడు విజ్ఞప్తి చేశారు.

## అర్హులైన వారికే రాజీవ్ యువ వికాసం అందించాలి

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ ప్రధాన కార్యదర్శి శీలం



**ముస్తాబాద్, మే 24 (నిఘా న్యూస్):** నాయకుల ప్రమేయం లేకుండా, అధికారులు పారదర్శకంగా అర్హులైన పేద యువతకే రాజీవ్ యువ వికాసం రుణాలు అందచేయాలని, అలాగే ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరిగినా దరఖాస్తుదారుల పక్షాన ఉద్యమిస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి యువకులతో కలిసి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి ప్రభుత్వం అనేక షరతులు పెట్టి లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తుందన్నారు. దరఖాస్తుదారులకు షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం సబ్సిడీ రుణాలను ఇవ్వాలని కోరారు. అప్లై చేసుకున్న ప్రతి నిరుపేద యువతీ, యువకులకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్ధి చేకూరే విధంగా అధికారులే పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని,గ్రామీణ స్థాయిలో కొందరు పథకం ఇప్పిస్తాని చేతివాటం చూపించే అవకాశం ఉందన్నారు. ఎంపిక ప్రక్రియలో అధికారులే నిజమైన లబ్ధిదారులను గుర్తించి రుణాలు ఇవ్వాలన్నారు. మధ్యవర్తులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగినా, అనర్హులను పథకంలో చేర్చినా దరఖాస్తుదారుల పక్షాన ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య, సంతోష్, రమేష్, శ్రీనివాస్, రాజు, భాను, శేఖర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు




### మండల విద్యాధికారి ప్రభాకర్

**ధర్మపురి, మే 24 (నిఘా న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గత ఐదు రోజులుగా జరుగుతున్న ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయ బృందం గుణాత్మక విద్యను అందిస్తుందన్నారు. ప్రభుత్వం అన్నిరకాల వసతులను సమకూర్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల్లో నూతన బోధనపద్ధతులను ఎప్పటికప్పుడు నవీకరించటం కోసం ఈ ఐదు రోజుల వృత్యంతర శిక్షణ ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు అందరూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతం చేయాల్సిందిగా కోరారు. ఐదు రోజుల శిక్షణ విజయవంతం చేయడానికి కృషి చేసిన రిసోర్స్ పర్సన్ లను ఈ సందర్భంగా మండల విద్యాధికారి సన్మానించారు. అలాగే శిక్షణలో చురుకుగా పాల్గొన్న ఉపాధ్యాయులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంతోషం మల్లారెడ్డి, నూతి మల్లన్న, రాములు,నున్నావత్ మోతిలాల్ నాయక్, రిసోర్స్ పర్సన్లు జాడి శ్రీనివాస్,గంకిడి వెంకటరమణ రెడ్డి, గుర్రాల గంగారెడ్డి, అడిసెర్ల సతీష్, సిరిపురం సునిల్, ఈగం సంతోష్, బి.జలపతి, హైమావతి క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు ఎదుల్ల ప్రేమ్ సాగర్, బట్టు కుమారస్వామి, కవిత, శ్రీలత, మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది సురేష్, సునీత, రాజు మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర



**శేరిలింగంపల్లి, మే 24 (నిఘా న్యూస్):** ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం చూపెట్టిన పరాక్రమాన్ని, ధైర్య సాహసాలను కీర్తిస్తూ భారత సైనిక చర్య విజయానికి మద్దతుగా సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటి శేరిలింగంపల్లి అసెంబ్లీ ఆధ్వర్యంలో మియాపూర్ శివాలయం నుండి ప్రారంభమై మైత్రీనగర్ స్వామి వివేకానంద విగ్రహం వరుకు పెద్ద ఎత్తున 'తిరంగా యాత్ర' కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ యాత్ర ద్వారా దేశభక్తిని, సైనికుల పట్ల గౌరవాన్ని, ప్రజల ఐక్యతను మరింత బలోపేతం చేయాలనే సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సినీ నటులు ఆర్ కె నాయడు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, రాష్ట్ర నాయకులు నరేష్, రవీందర్ రావు,ప్రభాకర్ యాదవ్, కేశవ్ రావు, నాగుల్ గౌడ్, బోయిని అనూష మహేష్ యాదవ్, రాధ కృష్ణ, ఎల్లేశ్, రామ రాజు, మనిభూషణ్, డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, జితేందర్, నాయకులు అనిల్ గౌడ్, మణిక్ రావు, నర్సింగ్ యాదవ్, వీరు, వివిధ సంఘాల నాయకులు, వ్యాపారవేత్తలు, బిల్డర్లు, న్యాయవాదులు, వైద్యులు వివిధ సంస్థలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేరేడ్ మెట్ ఎస్ఐ శ్రీనివాసరావు




**మల్కాజిగిరి, మే 24 (నిఘా న్యూస్):** సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని నేరేడ్ మెట్ ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. శనివారం నేరేడ్ మెట్ పిఎస్ ఆధ్వర్యంలో సూర్య నగర్ కాలనీలో ప్రజలకు దొంగతనాలు, సైబర్ క్రైమ్, డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆన్ లైన్, సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి. వాటిని ఎలా ఎదుర్కోవాలి, ఎలా అప్రమత్తంగా ఉండాలి అనే అంశాలను వివరించారు. ఎక్కడైనా దొంగతనం,ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 100 కు డేయిల్ చేయాలని ఆయన కోరారు. అదే విధంగా డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, అవి వాడితే వచ్చే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నేరేడ్ మెట్ పోలీసులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన తలసాని



**సనత్‌నగర్, మే 24 (నిఘా న్యూస్):** వెస్ట్ మారేడ్ పల్లిలోని యంఎల్ఏ కార్యాలయంలో సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలోని 44 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి 26 మందికి షాదీముబారక్ 18 మందికి ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వివిధ రూపకంగా ఆర్థిక లబ్ధి పొందినవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో లబ్ధిపొందిన వారు తమ పరిసరాలలోని అర్హులైన వారు లబ్ధిపొందే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. పేద మధ్య తరగతి ప్రజలకు మేలు జరిగేలా అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, కుర్మ హేమలత, తహసీల్దార్ పాండు నాయక్,బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్ ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, నాయకులు శ్రీహరి, కిషోర్, ఏసూరి మహేష్, నరేందర్, నాగులు, ఆరీఫ్, లక్ష్మీపతి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎలక్షన్లను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**వలిగొండ, మే 24 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు కూచిమల్ల సుధాకర్ మాట్లాడుతూ, సర్పంచ్ ఎన్నికలు ఏడాదిన్నర క్రితం జరగాల్సినవి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష ధోరణితో వాయిదాలు వేస్తూ వస్తుంది. 18 నెలల నుండి గ్రామ పంచాయతీ పాలన మొత్తం అధికారుల చేతులోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు ఇవ్వడం లేదు పాలకవర్గం లు లేక కేంద్రం నుండి వచ్చే నిధులు ఆగిపోయినవి గ్రామాల అభివృద్ధి కుంటపడుతుంది. ఇప్పటికీ ఎన్నికల అధికారుల నుండి ఇంకా పూర్తిగా క్లారిటీరాలేదు. మీడియాల్లో మాత్రం ఇదిగో వస్తున్నవి అదిగో వస్తున్నవి అని ఊరిస్తూ ప్రచారాలు మాత్రమే చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి క్లారిటీ లేక కాలయాపన చేయటం అలవాటుగా మారిపోయిందని గ్రామాలలో ప్రజలు అనుకుంటున్నారని అన్నారు.



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్ ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ గౌడ్ తదితరులు.

– అంబర్‌పేట, మే 24(నిఘా న్యూస్):

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**తిరుపతి, మే 24 (నిఘా న్యూస్):** ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల ను బాధితునికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో అందించారు. ఐదవ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కు చెందిన మోహన్ కృష్ణా లివర్ ట్రాన్స్ ఫ్లాంటేషన్ చేయించుకున్నారు. మధ్యతరగతికి చెందిన మోహన్ కృష్ణా అంత ఆర్థిక భారం మోయలేక సిఎంఆర్ఎఫ్ కు ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా దరఖాస్తు చేసుకోగా ఏడు లక్షల రూపాయలు మంజూర య్యాయి. ఆ చెక్‌ను బాధితుడు మోహన్ కృష్ణాకు ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఐదవ డివిజన్ అధ్యక్షులు పురుసోత్తం తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు





**శేరిలింగంపల్లి, మే 24 (నిఘా న్యూస్):** మాదాపూర్ శిల్పారామంలో డాక్టర్ వినీల రావు శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. గణేష్ పంచరత్న, బ్రహ్మాంజలి, శివ తాండవం, బృందావన నిలయే, రామాయణ శబ్దం, జతిస్వరం, బాల గోపాల తారంగం, కొలువైతివా రంగ సాయి, భో శంభో, దశావతారం, హిందోళ తిల్లాన అంశాలను కళాకారులూ రుత్విజ, శాన్వి, వివేకా, సమ్రితి, ఆరాధ్య, సిరి చందాన, గౌతమి, శిరీష, రితిక, విశీతా, సింధు, సాయి సరయు, వైష్ణవి, చరిత కృష్ణ, స్రవంతి, దివ్య, గాయత్రీ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. గౌరీ శంకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

## హెచ్‌బి కాలనీలో బీజేపీ తిరంగా యాత్ర

**మౌలాలి, మే 24 (నిఘా న్యూస్):** పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం సాధించిన విజయాన్ని పురస్కరించుకుంటూ ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్‌లో చేపట్టిన తిరంగా యాత్రలో ముఖ్యఅతిధులుగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, మాజీ శాసన సభ్యులు బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి,జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, తాడూరి శ్రీనివాస్, శిల్పా రెడ్డి పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ గోరిగే కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, చంద్రమౌళి, హన్మంత్ బిరాధర్, వై.సత్యనారాయణ,మల్కా ప్రకాష్, కొమ్మగల్ల నవీన్ కుమార్, మోహన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గంధ మల్ల గోపి, కాటేపల్లి రవీందర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, మంజుల వాణి, క్రాంతి కుమార్, నవీన్ కుమార్ చింటూ, ప్రతాప్ రెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

# నేడు యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షలు

- అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్, మే 24 (నిఘా న్యూస్):** యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ ఎగ్జామినేషన్– 2025 నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలు తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ కోసం హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. యూపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను 4141మంది అభ్యర్థులు రాయను న్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందన్నారు. మొదటి సెషన్ పరీక్ష ఆదివారం మే 25న ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకు, రెండో సెషన్‌లో పరీక్ష మధ్యాహ్నం2:30 నుండి సాయంత్రం 4:30గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు 30నిమిషాల ముందుగానే చేరుకోవాలన్నారు. ఉదయం 9 తర్వాత, మధ్యాహ్నం 2 గంటల తర్వాత వచ్చే అభ్యర్థులను పరీక్ష కేంద్రం లోనికి అనుమతించరని పేర్కొన్నారు. కావున అభ్యర్థులు పరీక్షా కేంద్రా లకు సకాలంలో చేరుకో వాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు తో పాటు అందులో పేర్కొన్న గుర్తింపు కార్డులలో ఏదైన ఒక కార్డును వెంట తెచ్చు కోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతిం చబడవన్నారు. పరీక్ష కేంద్రానికి అడ్మిట్ కార్డుతో పాటు పెన్ను, పెన్సిల్లు వెంట తెచ్చుకోవాలన్నారు చేతి గడియారాలు కూడా అనుమతించబడవని అన్నారు. పరీక్షా కేంద్రంలోనికి ఉదయం 8, మధ్యాహ్నం 1:00గంటల నుండి పరీక్ష రాసే అభ్యర్థులను అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ ప్రకటనలో తెలియజేశారు.

# టీకాలతో వ్యాధి నిరోధక శక్తి వృద్ధి

### కింగ్ కోటి సీనియర్ ప్రజా ఆరోగ్య అధికారి డాక్టర్ సాయిబాబ



**హైదరాబాద్, మే 24 (నిఘా న్యూస్):** కింగ్ కోటి ప్రజా ఆరోగ్య అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సాయి బాబా అదనంగా కంటోన్మెంట్ సీనియర్ ప్రజా ఆరోగ్య అధికారిగా పదవి బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా కంటోన్మెంట్ సీనియర్ ప్రజా ఆరోగ్య అధికారిగా పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సాయిబాబా పర్యవేక్షణలో భాగంగా బొల్లారం, తిరుమలగిరి ప్రాంతాలలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీధర్‌తో కలిసి స్పెషల్ వ్యాక్సిన్ క్యాంపెయిన్‌లో భాగంగా కొనసాగుతున్న వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనివార్య కారణాల వలన టీకాలు వేయించుకొని చిన్నారులకు ప్రభుత్వం ప్రత్యేకంగా చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కోరారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో శరీరంలో వ్యాధి నిరోధక శక్తి వృద్ధి చెందుతుందని గుర్తు చేశారు. తద్వారా తదితర రోగాలు చిన్నారులకు దరి చేరవని చిన్నారుల తల్లిదండ్రులకు భరోసా కల్పించారు.

# ఛలో విజయవాడను జయప్రదం చేయండి



### ఏపీజీఈఏ క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు శిఖా శాంసన్

**బెల్లంకొండ, మే 24(నిఘా న్యూస్):** వచ్చే నెల5న విజయవాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్రోసూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు శిఖా శాంసన్ అన్నారు శనివారం రాజుపాలెం బెల్లంకొండ మండలాల్లోని అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ సంఘ సభ్యులు ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రోసూరు యూనిట్ అధ్యక్షులు శిఖా శాంసన్ పాల్గొని సంఘ సభ్యులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల జూన్ మూడో తేదీ నుంచి జరగనున్న ఏపీ జిఏ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి అన్నారు. ముఖ్యంగా జూన్ 5న రాష్ట్ర సంఘ కౌన్సిల్ సమావేశాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆహ్వానించామన్నారు. క్రోసూరు తాలూకా యూనిట్ పరిధిలోని బెల్లంకొండ రాజుపాలెం క్రోసూరు ముప్పాళ్ళ మండలాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీజీఏ నాయకురాలు రాజుపాలెం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ బసవకుమారి, యూనిట్ అసోసియేట్ ప్రెసిడెంట్ పీవీ జె వి ప్రసాద్ రావు, యూనిట్ ఉపాధ్యక్షులు వీరయ్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీ ఏర్పాట్లు



### సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

**శామీర్‌పేట, మే 24 (నిఘా న్యూస్):** గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించినారు. గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ నుంచి గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ మే 25న ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1.30వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జేఎన్టియూహెచ్‌కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీటింగ్ అరేంజ్మెంట్స్ పక్కాగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన త్రాగు నీరు, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మేర ఇన్విజిలేటర్ నియమించాలని, అభ్యర్థులు ఏ విధమైన ఎలక్ట్రానిక్, వాచీలు తీసుకురావద్దని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో మెడికల్ టీం ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల రూట్ లలో బస్సు నడపాలని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ షాపులు మూసి వేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం, అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, తహసీల్దారు స్వామి కూకట్ పల్లి తహసీల్దారు కార్యాలయం నుండి పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలకు హాజరైన ఎంపీ ఈటల రాజేందర్



**మల్కాజిగిరి, మే 24 (నిఘా న్యూస్):** మౌలాలి డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం 'శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం' జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మౌలాలి కార్పొరేటర్ సునీత యాదవ్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బీజేపీ నాయకులు గున్నాల చంద్రశేఖర్ యాదవ్ హజరైనారు. వేద పండితులు పూర్ణకుంభంతో ఈటల రాజేందర్ ని ఘనంగా స్వాగతించారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయం 23వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ వారు శాంతి కల్యాణం జరిపించారు. వేదపండితులు ఈటెల రాజేందర్‌కి రాజకీయ ఉన్నత పదవి వస్తుందని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ నగర్ కాలనీ పార్క్ స్థలం కబ్జా గురించి స్థానికులు, ఎంపీ రాజేందర్‌కు మొర పెట్టు కున్నారు. దీనికి వెంటనే స్పందించిన ఈటల రాజేందర్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా నాకు ఆ సమస్య పూర్తి వివరాలు ఇవ్వండి, తప్పకుండా పరిష్కారం చేస్తాను అని కాలనీ వాసు లకు ఆయన హామీ ఇచ్చారు. తమ కాలనీకి ఎంపీ ఈటల రాజేందర్ రాకతో ప్రశాంత్ నగర్ కాలనీ వాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఎన్నో ఏళ్లుగా మా కాలనీలో ఉత్సవాలు జరుపుకున్న ఇంత పెద్ద నాయకుడు ఎప్పుడు మా కాలనీకి రాలేదని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## మస్కిటో ఫాగ్ ను పరిశీలించిన కార్పొరేటర్ పావని



**ముషీరాబాద్, 24 మే (నిఘా న్యూస్):** గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని ఎంటమోలజీ విభాగం సిబ్బందితో మస్కిటోఫాగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తు అనంతరం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వారం లో ఒక రోజు కాకుండా పాత విధానాన్ని కొనసాగిస్తూ ప్రతి రోజు ఫాగ్ వెహికల్, ఒక హాండ్ పంప్ సిబ్బందితో పనులు జరిపించాలని కోరుతూ వారంలో ఒక్కో రోజు ఒక్కో డివిజన్లో ఫాగ్ స్ప్రే జరిగితే మిగిలిన రోజుల్లో ఫిర్యాదులు ఎక్కువ అయ్యే అవకాశం ఉందని. కావున పాత పద్ధతిని కొనసాగిస్తూ ప్రతి రోజు ఫాగ్ స్ప్రే చేయడమే కాకుండా హ్యాండ్ పంప్ మెషన్ లను సిబ్బందిని పెంచే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, ఫాగ్ స్ప్రే సూపర్వైజర్ మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఆలేరులో తిరంగా ర్యాలీ

### భారతీయ జనతా పార్టీ నాయకులు సందీప్ గౌడ్



**ఆలేరు, మే 24 (నిఘా న్యూస్):** శత్రువుల గుండెల్లో రైలు పరిగెత్తించిన భారత వీర జవాన్ల విజయానికి సంఘీభావంగా వారి త్యాగాలకు గౌరవం తెలియజేయడానికి యాదాద్రి భువనగిరి జిల్లా నియోజకవర్గ కేంద్రం ఆలేరులో ఆదివారం సాయంత్రం వివేకానంద విగ్రహం వద్ద నుండి దుర్గామాత ఆలయం వరకు తీరంగా ర్యాలీ నిర్వహించారు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా భారత వివిధ దళాల గౌరవ వందనం చేద్దామని భారతీయ జనతా పార్టీ నాయకులు సందీప్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కులమతాలకు రాజకీయ పార్టీలకతీతంగా ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో పాల్గొని ప్రతి ఒక్కరు భారత జవాన్లకు బాసటగా నిలవాలని, సంఘీభావం యాత్ర విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

## వేసవి తరగతులను సందర్శించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ



**వలిగొండ, మే 24(నిఘా న్యూస్):** వలిగొండ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ జిల్లా యాదాద్రి భువనగిరి ఆదేశానుసారం శనివారం వలిగొండ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వేసవి శిక్షణ తరగతులకు స్థానిక జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధి కురిమేటి యాదయ్య సందర్శించారు. ఈ కార్యక్రంలో ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పిల్లలకు ఆటపాటలతో కూడిన డ్రాయింగ్ (చిత్రలేఖనం) చేస్తూ, క్యారం బోర్డు, రింగ్ బాల్, వాలీబాల్ తదితర (ఇండోర్ గేమ్స్) ఆటలను ఆడుకోవడానికి మెటీరియల్ తో వేసవిలో పిల్లలు ఎండలో తిరగకుండా, ఈతకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని అన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఈ శిక్షణ కార్యక్రమం 31మే వరకు కొనసాగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో వేసవి శిక్షణ తరగతులకు తమ ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలందరూ తప్పకుండా హాజరయ్యేలా ప్రోత్సహించాలని ఈ సందర్భంగా వారికి స్నాక్స్ పంపిణీ జేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలతో రేపటి నుండి ఎక్కువ మంది పిల్లల్ని హాజరయ్యేలా లీగల్ సర్వీస్ ప్రతినిధులు, కురిమేటి యాదయ్య మోటివేషన్ చేస్తూ ప్రోత్సహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఎడ్యుకేషన్ యులు ఉపాధ్యాయులు సంగిశెట్టి రాములు పాల్గొన్నారు.

# పోటాపోటీగా సిపిఎల్ సీజన్ వన్

- ఆదిత్య లెవన్స్‌పై రాయల్ చాలెంజ్ విజయం
- శశాంక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు

**తిరుపతి, మే 24 (నిఘా న్యూస్):** ఎస్వీ యూనివర్సిటీ తారకరామా స్టేడియంలో చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సిపిఎల్) మ్యాచ్‌లు పోటాపోటీగా జరుగుతున్నాయి సిపిఎల్ సీజన్-1లో భాగంగా శనివారం ఉదయం రాయల్ చాలెంజ్ తిరుచానూరు వర్సెస్ ఆదిత్య లెవన్స్ జట్లు పోటీపడ్డాయి. మొదట బ్యాటింగ్ కు దిగిన ఆదిత్య లెవన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. బ్యాటింగ్లో అభిషేక్ 57 బంతుల్లో 8ఫోర్లు, 6సిక్సర్లతో 91పరుగులు చేసారు. 173పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజ్ తిరుచానూరు జట్టు 18.1 ఓవర్లలో 175/5పరుగులు చేసి విజయం సాధించింది. బ్యాటింగ్ లో ఓపెనింగ్ బ్యాట్స్మెన్ శశాంక్ శ్రీనివాస్ కేవలం 19బంతుల్లో 5సిక్సులు, 5ఫోర్లతో 56 పరుగులు చేసి జట్టుకు శుభారంభం అందించారు. మరో ఓపెనగా దిగిన కెప్టెన్ జ్ఞానేశ్వర్ 10 ఫోర్లతో56 (46) పరుగులతో రాణించారు. ఓపెనర్స్ ఇద్దరు విజృంభించి ఆడడంతో రాయల్ చాలెంజ్ జట్టు ఆదిత్య జట్టుపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కేవలం 19 బంతుల్లో 56 పరుగులు చేసిన శశాంక్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నారు.

### స్పోర్టర్ వారియర్స్ పై హైపీరియన్ జట్టు విజయం..

మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో హైపిరియన్ జట్టు స్పోర్టర్ వారియర్స్ జట్టుపై ఆరు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్ కు దిగిన స్పోర్టర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. బ్యాటింగ్ లో మీనా రాహుల్ 42, మనోజ్ సాయి 41పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో మహమ్మద్,సయ్యద్ అఖిల్ రెండు వికెట్లు తీసుకున్నారు. 172 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైపిరియన్ జట్టు కేవలం 15.5 ఓవర్లలో 173/4 పరుగులతో విజయం సాధించింది. బ్యాటింగ్ లో తేజ రెడ్డి 40(25), హర్ష రెడ్డి 54(29) పరుగులతో రాణించారు. ఈ మ్యాచ్‌లో



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్న హర్షా రెడ్డికి సిడిసిఏ ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెడిగో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాజిత్ దంపతులు,సిడిసిఏ ఉపాధ్యక్షులు మురళి యాదవ్‌లు జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్)తో కలిసి తదితరులు నగదు,మెమొంటోను అందజేశారు.

## పాఠశాల గ్రంథాలయానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వేముల



**రామన్నపేట, మే 24 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామంలో డిఎంఎఫ్ నిధులనుండి 5 లక్షల రూపాయలతో పాత పాఠశాల భవనం వద్ద నిర్మించనున్న అదనపు తరగతి గది (గ్రంథాలయం) నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, ఎంపిడిఓ యాకూబ్ నాయక్, పంచాయతీ రాజ్ ఏ.ఈ బోయ గాలయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, తాజా మాజీ వైస్ ఎంపిపి నాగటి ఉపేందర్ తాజా మాజీ వార్డు సభ్యులు నోముల ప్రవీణ్, సుర్వి సతీష్ మాజీ సర్పంచ్ లు ఆవుల నరసింహ, బోయిని ఆనంద్, గ్రామ ప్రజలు ఆవుల సత్యనారాయణ, చల్ల సత్యప్రకాష్, పేరుమండ్ల నవీన్, ఆవుల పర్వతాలు, ఆలకుంట్ల రాజు, నోముల శంకర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## బాలాజీ ఎన్‌క్లేవ్‌లో కార్పొరేటర్ జితేంద్ర నాధ్ పర్యటన



**అల్వాల్, మే 24 (నిఘా న్యూస్):** మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ ఎన్‌క్లేవ్‌లో శనివారం కార్పొరేటర్ జితేంద్ర నాధ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు సిసి రోడ్లు వేయాలని కోరారు. దీనికి స్పందించిన కార్పొరేటర్, రెసిడెంట్ వెల్ఫేర్ అభ్యర్థన మేరకు వర్క్ ఇన్స్పెక్టర్ ను కాలనీకి రప్పించి మెజర్ మెంట్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్ నెంబర్‌లో డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ వేయించానని, అదే విధంగా ఇప్పుడు సీసీ రోడ్ వేయిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పూడికతీత పనులు వేగవంతం చేయండి

### అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి రెడ్డి



**అల్వాల్, మే 24 (నిఘా న్యూస్):** నాలా పూడికతీత పనులు వేగవంతం చేయాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి రెడ్డి అన్నారు. శనివారం ఆమె, ఏఈ వరుణ్ దేవ్ తో కలిసి డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపట్టిన నాలా పూడికతీత పనులను ఆమె పర్యవేక్షించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా కాలనీలోని వరద నీరు సాఫీగా బయటకు తరలి వెళ్లేందుకు పూడికతీత పనులను చేపట్టామని తెలి పారు. కాలనీలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని కార్పొరేటర్ కాలనీవాసులకు సూచించారు. మౌలిక వసతులను కల్పించి కాలనీ అభివృ ద్ధికి కృషి చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గోపాల్ కృష్ణ, గోపి, రమణ, భాస్కరన్, మురుగయ్య, అభిషేక్, గీత, స్థానిక నాయకులు యాదగిరి గౌడ్, ప్రేమ్ కుమార్, సాజిద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రకృతి ఆరోగ్యంపై మహాసభ

### పోస్టర్ ఆవిష్కరించిన ఆరోగ్య అభిమానులు



**సికింద్రాబాద్, మే 24 (నిఘా న్యూస్):** సిద్ధార్థ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 25న ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే ప్రకృతి ఆరోగ్య మహాసభ లను జయప్రదం చేయాలని పలువురు ఆరోగ్య అభిమానులు విజ్ఞప్తి చేశారు. శనివారం తార్నాకలో వారు మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ ప్రకృతి ఆరోగ్య మహాసభకు ముఖ్య అతిథులుగా ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు కవి గాయకుడు జయరాజు, జలసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దుచ్చెర్ల సత్యనారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఖాసిం తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని వెల్లడించారు. ఈ పోస్టర్ ను ఆవిష్కరించిన వారిలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సయ్య, నిర్వాహకులు చింత రెడ్డి వీరారెడ్డి, చాలా లింగయ్య, కందుల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, కాకునూరి సుధాకర్, పునిరెడ్డి జైపాల్ రెడ్డి, రాకేష్, నగేష్ తదితరులు ఉన్నారు.

## శిక్షణను విద్యార్థుల ఉన్నతికి వినియోగించాలి




**కారేపల్లి, మే 24(నిఘా న్యూస్):** కారేపల్లి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణాంశాలను తరగతిగదిలో అమలు జరిపి వారి ఉన్నతికి ఉపయోగపడేలా చేయాలని సింగరేణి మండల విద్యాశాఖాధికారి దుగ్గిరాల జయరాజ్ అన్నారు. బాష, గణిత, కనీస సామర్థ్యాల సాధన పై మండల స్థాయి ఎస్‌జీటీ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, డీఎస్సీ-2008 ఉపాధ్యాయులకు కారేపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో జయరాజు మాట్లాడుతూ సులభతర బోధనా విధానాలు అమలు చేయటం ద్వారా విద్యార్థుల ఉన్నతి సాధించ గల్గుతారన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు కనీస సామర్థ్యాలు, గుణాత్మక విద్యను అందించటానికి టీఎల్ఎం, గ్రంథాలయం ను వినియోగించుకోవాలన్నారు.

పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించి పాఠశాల నిర్వాహణలో, విద్యార్థులు నమోదుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పదోతరగతిలో మండల ఫస్ట్ వచ్చిన విద్యార్థిని చాగంటి సాయి మన్వితను సన్మానించారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎండీ.బాబు, రిసోర్స్ పర్సన్లు బీ.శ్యామ్‌లాల్, ఎల్.లక్ష్మణ్, బీ.శ్రీను, బీ.రామకోటి, జాకీర్‌బాబా, కే.బాలాజీ, మోహన్, బీ.వీరన్న సీఆర్పీలు భూక్య విజయ్, లకావత్ రాము, ప్రమీల, వాంకుడోత్ మోతిలాల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్‌లో సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణి



### బలహీన వర్గాల ఆశాజ్యోతి సీఎం రేవంత్ రెడ్డి

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి

**ముస్తాబాద్, మే 24 (నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండల కేంద్రంలోనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బాల్ రెడ్డి ఆధ్వర్యంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పక్క ప్రణాళికతో సీఎంఆర్ఎఫ్ నిధులను పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. శనివారం మండలానికి దాదాపుగా 22 చెక్కులు వచ్చాయని దీని ద్వారా 9 లక్షల 25 వేల రూపాయల వరకు పేదలు లబ్ధి పొందారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజా ప్రభుత్వమని సంక్షేమ పథకాలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్,బీసి సెల్ మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్, గూడెం,మద్దికుంట,బందనకల్ గ్రామశాఖ అధ్యక్షులు బాబు దొనుకుల కొండయ్య తుపాకుల శ్రీనివాస్ మామిండ్ల ఆంజనేయులు యాగండ్ల మల్లేశం షాదుల్ పాప పుల్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

## మహానాడును విజయవంతం చేయాలి





### మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

**పలమనేరు, మే 24 (నిఘా న్యూస్):** కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ నియోజకవర్గ అబ్జర్వర్,మాదిగ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా ప్రభుత్వ అరాచకాలు, తెలుగుదేశం పార్టీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించ డమే గాక రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేశారు. పేదల కడుపు నింపే పార్టీ తెలుగుదేశం అయితే పేదల కడుపు కొట్టే పార్టీ వైకాపా అని విమర్శలు గుప్పించారు. కట్టడం తెలుగుదేశం నైజం అయితే కూల్చడం వైకాపా వంతు అన్నారు. ఈ సందర్భంగా జగన్ పాలనపై ఆమె వ్యంగస్త్రాలు సంధించారు. కడపలో జరగనున్న మహానాడు పండుగకు వేలాది గా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేడర్ కు ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వి.కోట,బైరెడ్డి పల్లి, పలమనేరు టౌన్,రూరల్, పెద్దపంజాణి, గంగవరం మండలాల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ్, ఆర్బీసీ కుట్టి, నాగరాజు రెడ్డి, ఆనంద్, సోమశేఖర్ గౌడ్ సీనియర్ నాయకులు ఆర్ వి, బాలాజీ, రామచంద్ర నాయుడు, నాగరాజు, గిరిబాబు లతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇంచార్జ్ లు, యూనిట్ ఇంచార్జ్ లు తదితరులున్నారు.

## శిక్షణను విద్యార్థుల ఉన్నతికి వినియోగించాలి

**కారేపల్లి, మే 24(నిఘా న్యూస్):** కారేపల్లి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణాంశాలను తరగతిగదిలో అమలు జరిపి వారి ఉన్నతికి ఉపయోగపడేలా చేయాలని సింగరేణి మండల విద్యాశాఖాధికారి దుగ్గిరాల జయరాజ్ అన్నారు. బాష, గణిత, కనీస సామర్థ్యాల సాధనపై మండల స్థాయి ఎస్‌జీటీ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, డీఎస్సీ-2008 ఉపాధ్యాయులకు కారేపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో జయరాజు మాట్లాడుతూ సులభతర బోధనా విధానాలు అమలు చేయటం ద్వారా విద్యార్థుల ఉన్నతి సాధించగల్గుతారన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు కనీస సామర్థ్యాలు, గుణాత్మక విద్యను అందించటానికి టీఎల్ఎం, గ్రంథాలయం ను వినియోగించుకోవాలన్నారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లు నిర్వహించి పాఠశాల నిర్వాహణలో, విద్యార్థులు నమోదుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పదోతరగతిలో మండల ఫస్ట్ వచ్చిన విద్యార్థిని చాగంటి సాయి మన్వితను సన్మానించారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎండీ.బాబు, రిసోర్స్ పర్సన్లు బీ.శ్యామ్‌లాల్, ఎల్.లక్ష్మణ్, బీ.శ్రీను, బీ.రామకోటి, జాకీర్‌బాబా, కే.బాలాజీ, మోహన్, బీ.వీరన్న సీఆర్పీలు భూక్య విజయ్, లకావత్ రాము, ప్రమీల, వాంకుడోత్ మోతిలాల్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల వద్ద ఎక్సైజ్ శాఖ నిఘా

### మద్యం ధరలు పెంచినా, సమయపాలనలో అతిక్రమిస్తే చర్యలు తప్పవు




**పలమనేరు, మే 24 (నిఘా న్యూస్):** పలమనేరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్ లను శుక్రవారం రాత్రి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేశారు. మద్యం దుకాణాల్లో ధరల పట్టిక, రికార్డులు, ఇతర నిబంధనలు పరిశీలించారు. ప్రయివేటు మద్యం దుకాణాలైను నిబంధనల ప్రకారం విక్రయించాలని ఆదేశించారు. మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్ లు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు మాత్రమే నిర్వహించాలని, సమయపాలన పాటించని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఎక్సైజ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించామని సిఐ తెలిపారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



**ముస్తాబాద్, మే 24(నిఘా న్యూస్):** ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు వెంకన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా వారికి బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బాధ నరేష్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. తదుపరి నరేష్ మాట్లాడుతూ ఆత్మీయ మిత్రుడు వెంకన్న అంచె లంచెలుగా ఎదుగుతూ ఉన్నత పదవులు పొందాలని కోరారు. ప్రజా సమస్యల మీద పోరాటం చేస్తూ ప్రజలతో మమేకమై వారికి అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చికోడు గ్రామశాఖ బూత్ అధ్యక్షుడు రాజు యాదవ్ అదేవిధంగా బిజెపి సీనియర్ నాయకుడు గూడ బాలేశ్వర్ రెడ్డి, కొండాపూర్ గ్రామ బూత్ అధ్యక్షుడు గంధం అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ది పెంతెకోస్తు బైబిలు స్టడీస్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ




**ఉప్పల్ మే 24 (నిఘా న్యూస్):** ది పెంతెకోస్తు మిషన్ చర్చి సెంటర్ పాస్టర్ లూకాస్, బ్రదర్ శ్యాం పాల్ ఆధ్వర్యంలో ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్ లో ఈ నెల మే 26 సోమవారం నుండి 29 గురువారం వరకు రోజూ సాయంత్రం 6 గంటల నుండి జరుగబోయే ప్రత్యేక బైబిలు స్టడీస్‌కు ఉప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు అందరికీ ఆహ్వానం పలుకుతూ చిలుకా నగర్ క్రైస్తవ సహవాస సమాజం, ఫెలోషిప్ చైర్మన్ రెవ పీటర్ పాల్ ముఖ్య అతిథిగా హాజరై వాల్ పోస్టర్స్ ఆవిష్కరించారు. "మంచి సమర్థుడైన యేసు క్రీస్తు కొత్త నిబంధన సంఘం "అనే అంశంపై బైబిలు బోధనలు జరుగును. అన్ని డినామినేషన్లు, ఇండిపెండెంట్ చర్చిల పాస్టర్లు, విశ్వాసులు, కుల మత ప్రాంతీయ భేదము లేదు ప్రజలందరూ వచ్చి బైబిలు బోధనలు వినవచ్చునని, అందరికీ బోజన వసతి సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు.



## తుడా అభివృద్ధికి కలసికట్టుగా పనిచేద్దాం

### తుడా చైర్మన్ సి.దివాకర్

**తిరుపతి, మే 24 (నిఘా న్యూస్):** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేద్దామని తుడా చైర్మన్ సి.దివాకర్ అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆయా విభాగాల అధికారుల విధులు తదితరాలను ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని అభివృద్ధికి సహకరించాలని అన్నారు. తుడా పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి పనులు, లే అవుట్ల ఏర్పాటు పారదర్శకంగా జరిగేలా అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని అన్నారు. తుడా నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. తుడాలో జరుగుతున్న అభివృద్ధి ఇతర సంస్థలకు ఆదర్శంగా ఉండేలా అందరూ పనిచేయాలని అన్నారు.నూతనంగా ఏర్పాటు చేయనున్న లే అవుట్లలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అధికారులు, సిబ్బందికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని అందరూ నిబద్ధతతో విధులు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో సెక్రెటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి ఉద్యానవన శాఖాధికారి మాలతి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో..

# జోడెడ్లలా సంక్షేమం

- నిర్ణీత గడువు లోగా అంతర్గత రోడ్డు పనులు పూర్తి చేయాలి
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కూసుమంచి, మే 24 (నిఘా న్యూస్):** కాంగ్రెస్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి జోడెడ్లల పాలన సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తిరుమలాయపాలెం కూసుమంచి మండలాల్లో శనివారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా నుండి మన్నెగూడెం వరకు 3.75 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, పాతర్లపాడు క్రాస్ రోడ్ నుండి రావి చెట్టు తండా రోడ్డు వరకు 27 కోట్ల అంచనా విలువతో రెండు వరుసల రహదారిగా అభివృద్ధి పరుచు పనులు, మహ్మదాపురంలో బోడతండ నుండి సుబ్లేడు, మేడిదపల్లి రోడ్డు నుండి భవాని గుడి వరకు 3.15 కోట్లతో బిటి రోడ్డు, తెట్టెలపాడు గ్రామంలో ఏడు అంతర్గత సిసి రోడ్లు, గోపాలపురం నుండి జల్లేపల్లి వరకు 38కోట్ల రూపాయిలతో రెండు వరసల రహదారి పనులకు, చిన్న పోచారం నుండి కిష్టాపురం తాళ్ళచెరువు జెడ్పి రోడ్డు వరకు 2.80 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జీళ్ళచెరువు గ్రామంలో సూర్యాపేట-అశ్వరావుపేట రోడ్డు నందు 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూ ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామం, మండలంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే, అభివృద్ధి పనులు సైతం చేపట్టామని, పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి లకు ప్రాధాన్యత నిస్తూ పాలన సాగిస్తుందని అన్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు ద్వారా నిరుపేదలకు ఉగాది నుండి సన్న బియ్యం సరఫరా చేస్తుందని, ఇందిరమ్మ కమిటి అందించిన జాబితా ప్రకారం ఇందిరమ్మ ఇండ్లను మొదటి విడతలో నిరుపేదలకు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎక్కడా చిన్న పొరపాటు జరగడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకం క్రింద యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇచ్చామని, యాసంగి సీజన్ లో కూడా రైతులకు



బోనస్ చెల్లిస్తామని అన్నారు. రైతులకు ఉన్న భూ సమస్యలను అధికారులు నేరుగా గ్రామాలకు వచ్చి పరిష్కరించే దిశగా భూ భారతి చట్టం ద్వారా చర్యలు తీసుకున్నామని అన్నారు.

రైతులు, నిరుద్యోగులు, మహిళలు, గ్రామీణ నిరుపేదలకు ఇచ్చిన భరోసా ప్రకారం చిత్తశుద్ధితో పనిచేస్తామని, ఇచ్చిన ప్రతి మాటను పేదవానికి చేర్చడానికి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి అన్నారు. మంత్రి తన పర్యటనలో పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఏడిఏ సరిత, తిరుమలాయపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడివో సిలార్ సాహెబ్, కూసుమంచి మండల ఇన్ చార్జి తహశీల్దార్ కరుణశ్రీ, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనాయిపల్లిలో ఘనంగా బోనాల జాతర



**తూప్రాన్, మే 24 (నిఘా న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లికి బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో వీధివీధిన అమ్మవారి బోనాలు ఊరేగింపుగా దేవాలయ ప్రాంగంలోనికి కదిలినాయి. మహిళలు పూనకాలతో పోతరాజుల విన్యాసాలతో కొనాయిపల్లి గ్రామం మారు మ్రోగింది. ఇందులో గ్రామస్తులు, పలువురు కుల సంఘాల నాయకులు, ముదిరాజ్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## 26బీసీ కులాలను బీసీల్లో చేర్చ డాన్ని పునరాలోచించాలి

### జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**వరంగల్, మే 24 (నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని 26 బీసీ కులాలను తెలంగాణ బీసీ కులాల జాబితా నుండి తొలగించడం జరిగిందని తొలగించిన కులాలను మళ్లీ బీసీ జాబితాలో చేర్చాలనే బీసీ కమిషన్ తీసుకున్న నిర్ణయంపై నర్సంపేట పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ 2014 కంటే ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలానుగుణంగా ఆమోదించినటువంటి రాష్ట్ర వెనుకబడిన తరగతుల జాబితాలో 138 కులాలు సామాజిక వర్గాలు ఉన్నాయని అన్నారు. అయితే 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 లోని 6వ కేంద్ర చట్టం) కింద లభ్యమైన అధికారాలను పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ జీ.వో.ఎం.ఎస్ నెంబర్. 3, 2014 ద్వారా తెలంగాణ రాష్ట్రం కోసం 112 కులాలు సామాజిక వర్గాల జాబితాను వెనుకబడిన తరగతులుగా స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల జాబితాలో ఉన్నటువంటి 26కులాలను తొలగించడం జరిగిందని తెలిపారు. అప్పుడు తొలగించిన 26 కులాలను మళ్లీ చేర్చాలని చూడడం సరైన పద్ధతి కాదని అన్నారు. బీసీ జాబితాలో కులాలను చేర్చడమే జరుగుతుంది కానీ బీసీ కులాలకు రిజర్వేషన్ల పెంపు మాత్రం జరగడంలేదని డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పేర్కొన్నారు. చేశారు. తొలగించిన కులాలను మళ్లీ బీసీ జాబితాలో చేర్చాలనే విషయంలో రాష్ట్ర బీసీ కమిషన్ పునరాలోచించాలని డ్యాగల శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జీజుల సాగర్, జిల్లా కార్యదర్శి, చెన్నారావుపేట మండల ఇంచార్జ్ చెన్నూరి రవి, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, నర్సంపేట మండల నాయకులు మారపాక రమేష్ ముదిరాజ్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, నర్సంపేట పట్టణ యూత్ కార్యదర్శి గోపగాని నాగరాజు గౌడ్, దుగ్గొండి మండల నాయకులు సంకటి శ్రీనివాస్ గౌడ్, కడారి సురేష్ యాదవ్, కొలిపాక సుధాకర్, చెన్నారావుపేట మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, చెన్నారావుపేట గ్రామ మహిళా అధ్యక్షురాలు ముంజ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

### జిల్లా అదనపపు కలెక్టరు విజయేందర్ రెడ్డి



**శామీర్‌పేట, మే 24 (నిఘా న్యూస్):** అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అన్నారు. శనివారం మూడు చింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి, కేశవరం గ్రామాల్లో ధాన్య కొనుగోలు కేంద్రాలను అదనపపు కలెక్టరు పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని పరిశీలించి, అకాల వర్షాల నుండి అన్ని ముందుస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, కొనుగోలును వేగవంతం చేయాలని, ధాన్యాన్ని రైస్ మిల్లులకు మారాలని, ఓపీఎంఎస్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్య కొనుగొలు కేంద్రాలకు వెంటనే అదనపు వాహనాలను అందించాలని వరి రవాణా కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై శాఖ డిఎం సుగుణ బాయి, డీసీఎస్ఓ, తహశీల్దార్, డీటీసీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో కార్పొరేటర్ తనిఖీలు



**అంబర్‌పేట, మే 24(నిఘా న్యూస్):** అంబర్ పేట మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందిపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో కార్పొరేటర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో డెలివరీ పేషెంట్స్ కి అందుతున్న వైద్య సేవలపై వాకాబు చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు, మహిళలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని కార్పొరేటర్ సూచించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కృషితో ప్రభుత్వ ఆసుపత్రి విస్తరణలో భాగంగా 50పడకలతో నూతనంగా నిర్మించేందుకు 5కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఆయన గుర్తు చేశారు. నిధులు మంజూరైన పనులు జరగడం లేదన్నారు. ఆసుపత్రి విస్తరణ జరిగితే పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, దీనిపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి పనులు ప్రారంభించాలని కార్పొరేటర్ కోరారు. డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ దాక్షాయిని ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ దాక్షాయిని, వైద్యులు నాగశ్రీ, సంధ్య,శ్వేత సంతోష్,శ్రీమునిహ,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ రఫిక్, సూరజ్ ముదిరాజ్, అన్వేష్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## భారీగా నిషేదిత గంజాయిని పట్టుకున్న పోలీసులు

### వాహన తనిఖీలలో మూడు కోట్ల నలభై తొమ్మిది లక్షల రూపాయల విలువ చేసే గంజాయిని స్వాదీనం



**ఇల్లందు, మే 24 (నిఘా న్యూస్):** విశ్వసనీయ సమాచారం మేరకు టేకులపల్లి పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా టేకులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాలంపాడు ఎక్స్ రోడ్ సమీపంలో గల ఏ.సి. ఏ సులానగర్ మినిస్ట్రీ చర్చ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో ఎస్కార్ట్ గా వస్తున్న ఐచర్ వ్యాన్ ను ఆపి తనిఖీ చేయగా 698 కిలోల ప్రభుత్వ నిషేదిత గంజాయిని గుర్తించడం జరిగింది.సుమారుగా మూడు కోట్ల 50 లక్షల రూపాయల విలువ గల ఇట్టి గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకోవడమైనది. ఐచర్ వ్యానులో ఉన్న ముగ్గురు వ్యక్తులను కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టడం జరిగింది.ఇట్టి నిషేధిత గంజాయిని అమ్మిన వ్యక్తులపైన,కొనుగోలు చేసిన వ్యక్తులు, రవాణా చేస్తున్న వ్యక్తులందరిపై కేసు నమోదు చేసి అట్టి రవాణాకు ఉపయోగించిన ఐచర్ ను, కారును, ఐదు మొబైల్ ఫోన్లను కూడా సీజ్ చేయడం జరిగినది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు అటవీ ప్రాంతం నుండి హర్యానా రాష్ట్రం,కురుక్షేత్ర ప్రాంతానికి అక్రమంగా ఇట్టి గంజాయిని రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది.పట్టుబడిన నిందితులందరూ కురుక్షేత్ర జిల్లాకు చెందిన ప్రిన్స్ కుమార్ ఆదేశాలతో పార్సిల్ సర్వీస్ మాటున ఇట్టి గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డారు. పట్టుబడిన వ్యక్తులను జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టునకు తరలించడం జరిగినది.నిషేధిత గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న టేకులపల్లి సిఐ టి.సురేష్,ఎస్సై రాజేందర్,సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్,ఎస్సైలు ప్రవీణ్,రామారావు సిబ్బందిని ఎస్పి రోహిత్ రాజు ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## అక్రమ ఇటుక బట్టిలపై చర్యలు లేనట్టేనా..?

- ఇటుక బట్టీలకు చెరువు మట్టి తరలిస్తూ, ఇప్ప చెట్లు నరికివేత
- అధికారులు స్పందించక పోవడంపై విమర్శలు



**ఇల్లందు, మే 24 (నిఘా న్యూస్):** ఆదివాసి భూముల్లో వలసవాదులు ఇటుక బట్టీలు చేపడుతున్న వెనకడుగు వేస్తున్నారు, ఇల్లందు మండలం మామిడిగూడెం తీగలంచ గ్రామ పరిధిలో ఫిఫ్త్ షెడ్యూల్ ప్రాంతాలలో ఆదివాసి చట్టాలకు వ్యతిరేకంగా వలస వాదులుగా వచ్చినటువంటి వారు ఎలాంటి అనుమతులు లేకుండా ఇక్కడ సంపదలను కొల్లగొడుతూ ఐదు ఎకరాలలో అక్రమ ఇటికబట్టీలు నిర్వహిస్తు బట్టీలకు కావలసిన మట్టిని పక్కనే ఉన్న నాయకులగూడెం చెరువు నుండి అక్రమంగా మైనింగ్ శాఖ అనుమతులు లేకుండా తరలిస్తూ. బట్టీలను కాల్చేందుకు అడవులలోని చెట్లను నరికేయడమే కాకుండా ఆదివాసులకు ఉపయోగపడే ఇప్ప చెట్లను సైతం నరికేస్తూ ఇప్పపువ్వు, ఇప్పగింజలను సేకరించకుండా చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. బట్టీల వద్దకు ఉపయోగించే కరెంట్ అక్రమంగానే తీగల తగిలించడం విశేషం.పంట చేల మధ్యలోనే బట్టీలు నిర్వహించడంతో బట్టీల నుండి వెలువడి పొగ,కాలుష్యం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లుతుండటమే కాక చేలల్లో పని చేసుకోలేకపోతున్నాం అంటున్నారు. ఇక్కడున్న ఆదివాసి గిరిజనులకు పొగ కాలుష్యంతో ఆరోగ్యాలు పాడవుతుంటే అక్రమార్కులు మాత్రం ఇక్కడ తయారు చేసే ఇటికలను జిల్లాలు దాటిస్తూ లక్షలు దండుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, అటివిశాఖ, విద్యుత్ శాఖలతో పని లేదు.అంతా తానే అన్నట్టుగా వ్యవహరించడంపై మండిపడుతున్న స్థానికులు. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు తవిస్తున్నాయి. ఆదివాసి భూములు లీజుకు తీసుకొని అట్టి భూములలో నిర్వహిస్తున్న అక్రమ బట్టీలపై శాశ్వత చర్యలు లేనట్టేనా అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

# కేరళ తరహా ప్రజాపంపిణి వ్యవస్థ తీసుకరావాలి

- లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలో జరపాలి
- ఉపాధీ హామీ రక్షణకు పోరాటం : వ్యకాస

**కారేపల్లి, మే 24(నిఘా న్యూస్):** పేదలకు నిత్యావసర వస్తువులను అందించటానికి కేరళ రాష్ట్ర తరహా 12 రకాల నిత్యావసర వస్తువులు అందించే ప్రజాపంపిణి వ్యవస్థను ను తీసుకరావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండెబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కారేపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధీ పనులను వ్యకాస బృందం శనివారం పరిశీలించింది. ఈసందర్భంగా కూలీలను ఉద్దేశించి నాగేశ్వరరావు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ దోపిడి నుండి రక్షించి పేదలకు నిత్యావసర వస్తువులు అందించటానికి కోసం ప్రారంభించిన చౌక దూకాణాలను పాలకులు బియ్యం పంపిణికే పరిమితం చేశారని విమర్శించారు. పేదల కోసం పెట్టిన పధకాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధుల కోతలు తప్ప పెంచిన దాఖలాలు లేవన్నారు. ఉపాధీ హామీ పధకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గించారన్నారు. ఉపాధీ పనులను పేదలకు దూరం చేయటానికి పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించకుండా, కొలతలు, ఫోటో దింపు పద్దతి ని తీసుకవచ్చారన్నారు. 200 రోజుల పని దినాలు కల్పించాలని,కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ. 600 చెల్లించాలని, వసతులు, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనులు కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పధకాల ఎంపికను పారదర్శకంగా గ్రామసభలో చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ఉంటే ప్రభుత్వానికే చెడ్డ పేరువస్తుందన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల పక్రియ వేగవంతం చేయటంతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధీ హామీ రక్షణ, ప్రజా సమస్యలపై ఈనెల 30 ఖమ్మం కలెక్టరెట్ ఎదుట జరిగే ధర్నాకు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నారపు కృష్ణ, అగోల్ల హరి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, దిండు సీతారాములు, అదెర్ల ఏలియాబాయి, శ్రీరాములు, వేణు, నాగరాజు, సుశీల, వెంకటమ్మ, ఇమ్మడి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com